

సీమ వైపు వడివడిగా.. తుంగభద్ర

7లో..

● అనంతపురం రూరల్ మండలం పాపంపేటలో రేషన్ షాప్ నంబర్ 1225055 ఉంది. ప్రతి నెలా ఈ దుకాణానికి 90 క్వింటాళ్ల బియ్యం సరఫరా అవుతోంది. కానీ ఆగస్టుకు సంబంధించి ఆ డీలర్‌కు 22 క్వింటాళ్లు మాత్రమే సరఫరా కానున్నాయి. అక్కడ 67 క్వింటాళ్ల బఫర్ స్టాక్ ఉన్నట్లు చూపడమే దీనికి కారణం. వైసీపీ వర్గీయుడైన ఆ డీలర్ 67 క్వింటాళ్లకుపైగా బఫర్ చూపించారు. దీంతో ఆ లోటును ఎలా భర్తీ చేసుకోవాలో తెలియక కొత్తగా డీలర్‌షిప్ దక్కించుకున్న వ్యక్తి సతమతమవుతున్నారు. ఇదే ప్రాంతంలోని షాపు నంబరు 1225042లో సుమారు 38 క్వింటాళ్ల కొరత ఉంది. పాపంపేట ప్రాంతంలో ఏడు రేషన్ దుకాణాలు ఉండగా.. ఐదింటిలో బఫర్ స్టాక్ చూపుతున్నాయి.




బొమ్మనహాళ్ మండలం శ్రీధరఘట్టలో బియ్యం పంపిణీ (ఫైల్)

● అనంతపురం నగరంలోని 33వ రేషన్ దుకాణంలో 130 క్వింటాళ్లకుపైగా బఫర్ పెట్టారు. దుకాణం నంబర్ 101లో 110 క్వింటాళ్లకు పైగా బఫర్ ఉంది. అనంతపురం నగరం, రూరల్ ప్రాంతాల్లోని అత్యధిక రేషన్ దుకాణాలలో కనీసం 10 క్వింటాళ్ల బఫర్ చూపుతున్నారు. దీంతో ఆగస్టు నెలలో రేషన్ పంపిణీ డీలర్లకు సంకటంగా మారింది. తక్కువ స్టాకును కార్డుదారులకు ఎలా పంపిణీ చేయాలని వారు వాపోతున్నారు.

బఫర్ సంకటం!

అనంతపురం రూరల్, జూలై 25: ప్రభుత్వం మారగానే మొదట మారేది రేషన్ దుకాణాల డీలర్లే..! ఏ పార్టీ అధికారంలో ఉంటే.. ఆ పార్టీ మద్దతుదారులు రేషన్ దుకాణాలను దక్కించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అదే తరహాలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పలువురు డీలర్లు మారారు. డీలర్‌షిప్ దక్కించుకునేందుకు పోటీ తీవ్రస్థాయిలో నడిచింది. అవకాశం చిక్కించుకున్నవారు సంబరపడ్డారు. కానీ ఆ ఆనందం ఎక్కువసేపు నిలవలేదు. మొదటి నెల లోనే వారికి 'బఫర్ స్టాక్' సినిమా కనిపిస్తోంది. ఆగస్టు నెలలో పంపిణీ చేయాల్సిన కోటాలో భారీగా కోత పడుతోంది. ఆన్‌లైన్ రికార్డుల ప్రకారం జిల్లాలోని మెజార్టీ రేషన్ దుకాణాల్లో 'బియ్యం మిగులు' చూపుతోంది. అదిపోనూ మిగిలిన కోటాను మాత్రమే పౌరసరఫరాల శాఖ డీలర్లకు పంపేందుకు సిద్ధమైంది. ఆన్‌లైన్‌లో ఉన్న మిగులు నిల్వలు రేషన్ దుకాణాలలో వాస్తవంగాలేవు. దీంతో తక్కువ బియ్యాన్ని కార్డుదారులకు ఎలా సర్దాలో తెలియక కొత్త డీలర్లు తలలు పట్టుకుంటున్నారు.



పది క్వింటాళ్లకు పైగానే...

అనంతపురం జిల్లా కేంద్రం, అనంతపురం రూరల్ మండలంలో 132 రేషన్ దుకాణాలు ఉన్నాయి. అనంతపురం అర్బన్ పరిధిలో 55, రూరల్ మండలం పరిధిలో 77 దుకాణాలు ఉన్నాయి. గత నెల వరకూ వైసీపీ నాయకులు డీలర్లు వ్యవహరించారు. కార్డుదారులకు రేషన్ పంపిణీ చేశారు. ప్రభుత్వం మారడంతో రేషన్ దుకాణాలు టీడీపీ వారికి వచ్చాయి. ఇంత వరకు బాగానే ఉన్నా.. వైసీపీ నాయకులు పోతూ పోతూ బఫర్ స్టాకును చూపించారు. ఒక్కొక్క షాపులో కనీసం పది క్వింటాళ్లకు పైగా బఫర్ స్టాక్ ఉన్నట్లు సమాచారం. మరికొన్నింటిలో 50 నుంచి వంద క్వింటాళ్లకు బఫర్ స్టాక్ ఉంది. అనంతపురం అర్బన్ పరిధిలోని 55 రేషన్ దుకాణాలలో ఒకటి మినహా.. మిగిలిన అన్నింటిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. రూరల్ మండలం పరిధిలోను ఇదే పరిస్థితి. బియ్యం ఒక్కటే కాదు.. జొన్నలు, రాగులు తదితర సరుకులు కూడా బఫర్ స్టాక్ ఉన్నట్లు చూపిస్తున్నారు.



కేటాయింపుల్లో కోత..

బఫర్ స్టాక్ వివరాలను చూసి కొత్త డీలర్లు ఆందోళన చెందుతున్నారు. బఫర్ స్టాక్ కారణంగా ఆగస్టు కేటాయింపుల్లో కోత పెడుతున్నారు. పాత నిల్వలు పోనూ.. మిగిలిన స్టాక్‌ను మాత్రమే అధికారులు సరఫరా చేస్తారని తెలుస్తోంది. ఇదే జరిగితే.. రేషన్ పంపిణీలో కొత్త డీలర్లకు తిప్పలు తప్పవు. ఈ ప్రభావం కార్డుదారులపై పడుతుంది. వారికి అరకొరగా రేషన్ దక్కే అవకాశం ఉంది. బఫర్ స్టాక్ ఉన్న వైసీపీ డీలర్లపై అధికారులు కేసులు పెట్టారు. కానీ రికవరీ ఎలా చేస్తారనేదానికి అధికారుల వద్ద సమాధానం లేదు. బఫర్ జీరో చేస్తే కొత్త డీలర్ల సమస్య పరిష్కారం అవుతుంది. కార్డుదారులకు పూర్తిస్థాయిలో రేషన్ దక్కుతుంది. ఈ విషయంపై అనంతపురం రూరల్ మండలం సీఎస్ డీటీ వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. అందుబాటులోకి రాలేదు.

కొత్త డీలర్లకు కొరత గుబులు

ఆగస్టు కోటా బియ్యంలో భారీగా కోత..?

కనీసం 10.. ఆపై వంద క్వింటాళ్ల దాకా..

వైసీపీ డీలర్లు బఫర్ చూపడమే కారణం

● రాప్తాడు మండలంలో మొత్తం 32 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ఇందులో వంద క్వింటాళ్లకు పైగా బఫర్ చూపుతున్నారు. బండమీదపల్లిలోని ఓ రేషన్ దుకాణంలో 32 క్వింటాళ్లు, మరో దుకాణంలో 18 క్వింటాళ్లు, ఎర్రగుంటలోని ఓ దుకాణంలో 22 క్వింటాళ్ల బియ్యం బఫర్ స్టార్ ఉన్నట్లు చూపుతున్నారు. కొత్త డీలర్లు ఈ కొరతను ఎలా భర్తీ చేసుకోవాలో తెలియక సతమతమౌతున్నారు. పాత డీలర్ల నుంచి బఫర్ స్టాక్‌ను రికవరీ చేస్తామని అధికారులు చెబుతున్నారు.

● బొమ్మనహాళ్ మండలంలోని 39 రేషన్ దుకాణాలలో 502.72 క్వింటాళ్ల బియ్యం బఫర్ స్టాక్ ఉన్నట్లు చూపుతున్నారు. ఈ మొత్తం ఆగస్టులో కోత పెడతారని కొత్త డీలర్లు ఆందోళన చెందుతున్నారు.



మొత్తం బియ్యం ఇవ్వాలి..

నాకు కేటాయించిన రేషన్ దుకాణం పరిధిలో 613 కార్డులు ఉన్నాయి. వీటికి 73 క్వింటాళ్లకుపైగా రేషన్ బియ్యం సరఫరా చేయాలి. బఫర్ 38 క్వింటాళ్లు చూపుతోంది. బఫర్ పోనూ.. మిగిలిన బియ్యం సరఫరా చేస్తామని అధికారులు చెబుతున్నారు. అలా కాకుండా రేషన్‌కార్డులు ఎన్ని ఉంటే.. అన్నింటికీ సరిపడా నిల్వలను సరఫరా చేయాలి.

-బాబావలి, డీలర్, పాపంపేట



అన్నింట్లో బఫర్ ఉన్నాయి..

ప్రతి రేషన్ దుకాణంలో బఫర్స్ ఉన్నాయి. నాకు కేటాయించిన దుకాణంలో 90 క్వింటాళ్లకుగానూ 68 క్వింటాళ్ల బియ్యం బఫర్ ఉంది. అది కోత పెడితే ఆగస్టు నెలకు కేవలం 22 క్వింటాళ్ల బియ్యం వస్తుంది. ఆ బియ్యాన్ని మాత్రమే సరఫరా చేస్తామని అధికారులు అంటున్నారు. బియ్యం ఒక్కటే కాదు. సంచులు, చక్కెర, జొన్నలు.. ఇలా అన్నింటి బఫర్ చూపుతున్నారు. అధికారులు చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలి.

-జెట్టి భరత్, డీలర్, బసవతారక నగర్



క్లియర్ చేయాలి..


ఐదారు క్వింటాళ్ల బఫర్ ఉంటే.. కార్డుదారులకు సర్దిచెప్పి రేషన్ వేయవచ్చు. కానీ యాభై.. వంద క్వింటాళ్ల బఫర్ ఉన్నాయి. అంత కొరత ఉంటే సర్దుబాటు చేయడం కష్టం. అధికారులు బఫర్స్ పూర్తిగా క్లియర్ చేస్తే బాగుంటుంది.

-సాంబశివ, డీలర్, విద్యారణ్యనగర్

మా నీరు మాకివ్వండి..!

మా రైతులకు పెళ్లి కావడం లేదు

అసెంబ్లీలో ఎమ్మెల్యే అశ్మిత్ ఆవేదన



శాసనసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి/యాడికి, జూలై 25: తుంగభద్ర జలాల నుంచి తమ వాటా నీటిని వెంటనే అందించాలని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీలో గురువారం ఆయన జిల్లా రైతుల కష్టాలను ప్రస్తావించారు. 'జిల్లాలో దిగువ ప్రాంతాలైన గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాలకు నీరు అందడం లేదు. మా రైతులు ఇబ్బంది పడుతున్నారు. కాలువలు సరిగా లేకపోవడంతో మా కోటా అరకొర నీరు కూడా రావడం లేదు. బిందు సేద్యానికి సరిపడా నీరిచ్చినా మా రైతులు మంచి పంటలు పండిస్తారు. ఆ సంపాదనతో రాష్ట్రానికి అప్పు ఇవ్వగలరు..' అని అన్నారు. సాగునీటి కొరత కారణంగా పంటలు సరిగా పండటం లేదని, వ్యవసాయం చేసే యువకులకు పెళ్లిళ్ల కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 'రెండు రోజుల క్రితం నా వద్దకు ఒక యువకుడు వచ్చాడు. ఎలా ఉన్నావు..? ఎంతమంది పిల్లలు? అని అడిగాను. అతని సమాధానం నన్ను కలచివేసింది. పిల్లల మాట పక్కన పెట్టు.. నాకు పిల్లనిచ్చేటోడు ఎవరు..? అని ప్రశ్నించాడు. ఏమిటని ఆరా తీస్తే.. వ్యవసాయం చేస్తున్నానని, అందుకే పిల్లను ఎవరూ ఇవ్వడం లేదని చెప్పాడు. నాకు నోటమాట రాలేదు' అని సభ దృష్టికి తీసుకువెళ్లారు. వ్యవసాయం చేస్తున్నారని పిల్లను ఇవ్వకపోవడం ఏమిటో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 'మన ప్రభుత్వంలో అయినా రైతులకు నీరిద్దాం. సాగుకు సాయపడండి' అని జలవనరుల శాఖ మంత్రికి అశ్మిత్ విన్నవించారు. ఉమ్మడి జిల్లాలో సేద్యం చేసే యువకులకు వివాహం కావడం లేదన్న అంశంపై ఈ నెల 7న 'ఆంధ్రజ్యోతి' విశ్లేషణాత్మక కథనాన్ని ప్రచురించింది. 'మొగడే కల్యాణ వీణ' శీర్షికన ప్రచురితమైన ఈ కథనం పాఠకులను ఆలోచింపజేసింది. ఇదే సమస్యను తాడిపత్రి ఎమ్మెల్యే అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం పట్ల రైతాంగంలో హర్షం వ్యక్తమౌతోంది.



ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం

హెచ్చెల్సీ పనులను చేపట్టండి

అసెంబ్లీలో ఎమ్మెల్యే కాలవ



రాయదుర్గం టౌన్, జూలై 25: హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులను తక్షణం చేపట్టాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కోరారు. శాసన సభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. హెచ్చెల్సీ నిర్వహణ ఐదేళ్లుగా గాలికి వదిలేశారని, కాలువ ప్రమాదకరంగా మారిందనే విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందా అని ప్రశ్నించారు. ఆధునికీకరణ పనులను ఎప్పటిలోగా ప్రారంభిస్తారో స్పష్టత ఇవ్వాలని మంత్రిని కోరారు. హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులకు 2007లో అప్పటి ప్రభుత్వం రూ.463.50 కోట్లతో పాలనా అనుమతులు జారీ చేసిందని మంత్రి సమాధానం ఇచ్చారు. పనులను ఈపీసీ పద్ధతిలో, ఆరు ప్యాకేజీలుగా విభజించి 2009లో చేపట్టారని, 2017 చివరి నాటికి రూ.309.78 కోట్లతో 67.58 శాతం పనులు పూర్తి చేశారని తెలిపారు. 2020లో ఆరు ప్యాకేజీలను ప్రభుత్వం ముందుగానే ఆపేసిందని తెలిపారు. నీటిపారుదల పనుల జాబితాలో ఆరు ఈపీసీ ప్యాకేజీ పనుల ఒప్పందాలను ముందస్తుగా ముగించడానికి అనుమతులు ఇచ్చామని మంత్రి వివరణ ఇచ్చారు. ప్రీ క్లోజర్ కోసం సిఫార్సు చేసిన పనులను వచ్చే ఐదేళ్ల కాలంలో తిరిగి మంజూరు చేయడానికి ప్రతిపాదించకూడదని నిబంధన విధించిందని అన్నారు. కాలువ పరిస్థితి మరింత దిగజారడంతో పాటు పాత నిర్మాణాలు, రెగ్యులేటర్లు, వంతెనలు కూలిపోయాయని, ప్రవాహానికి ఆటంకం ఏర్పడిందని అన్నారు. ఐదు సంవత్సరాల నిబంధన సడలింపు ఇవ్వాలని, ఆధునికీకరణ పనులను చేపట్టాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ జలవనరుల శాఖ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ నివేదిక సమర్పించారని తెలిపారు. హెచ్చెఎల్ఎంసీపై అత్యవసరమైన కీలకమైన పది కట్టడాల పనులు చేపట్టడానికి పాలన అనుమతులు ఇవ్వాలని జలవనరులశాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్‌ను అనంతపురం జిల్లా కలెక్టర్ కోరినట్లు తెలిపారు. దీని కోసం రూ.33.05 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించామని తెలిపారు. ప్రతిపాదనలు వివిధ స్థాయిలలో ఉన్నాయని మంత్రి వివరించారు.

తల్లీబిడ్డలు చనిపోతే మీదే బాధ్యత

వైద్యులు, సిబ్బందికి కలెక్టర్ వార్నింగ్



వైద్యశాఖ సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్ కుమార్

అనంతపురం టౌన్, జూలై 25: ప్రసవం సమయంలో మరణాలు లేకుండా చూడాలని వైద్యాధికారులను కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. ఆస్పత్రులలో ఏ ఒక్క తల్లి, బిడ్డ చనిపోయినా బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కలెక్టరేట్‌లో గురువారం మాతాశిశు మరణాలపై సమీక్ష నిర్వహించారు. గత నెలలో జిల్లాలో సంభవించిన మరణాలు, కారణాల గురించి ఆరా తీశారు. వైద్యులు, వైద్య సిబ్బంది వివిధ కారణాలను చెప్పగా.. కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మాతాశిశు మరణాల విషయంలో నిర్లక్ష్యాన్ని సహించేదిలేదని హెచ్చరించారు. గర్భం దాల్చింది మొదలు అన్ని వివరాలు నమోదు చేస్తున్నామని, వైద్య పరీక్షలు, సేవలు అందిస్తున్నామని కలెక్టర్ గుర్తు చేశారు. కాబట్టి గర్భిణులకు ఏ సమస్య ఉన్నా ముందే తెలిసిపోతుందని, ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటే మరణాలు ఎందుకు సంభవిస్తాయని ప్రశ్నించారు. మాతాశిశువుల ప్రాణాలను కాపాడేందుకు చర్యలు తీసుకోకుండా ఏవో కారణాలు చెబితే ఎలా అని మండిపడ్డారు. 'ఇది మొదటిసారి కాబట్టి మీరు చెప్పింది వింటున్నా. మళ్లీ మరణాలు సంభవిస్తే క్షమించేది లేదు..' అని హెచ్చరించారు. ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు, వైద్య సిబ్బంది అన్న తేడా లేకుండా శిక్షలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పర్యవేక్షించాలని ఆదేశించారు. కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని, జిల్లాలో మాతాశిశు మరణాలు సంభవించకుండా చూడాలని అన్నారు.

కుష్టును పారదోలండి..

కుష్టును పూర్తిస్థాయిలో నిర్మూలించాలని, జిల్లాను కుష్టు రహితంగా మార్చాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. కుష్టు కేసుల గుర్తింపునకు, వ్యాధి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని ఆరాతీశారు. కుష్టుపై ప్రజలలో ఉన్న అపోహలను తొలగించాలని సూచించారు. ప్రతిఒక్కరినీ పరీక్షించాలని, లక్షణాలు ఉంటే పరీక్షలు చేయించాలని ఆదేశించారు. వ్యాధి నిర్ధారణ అయినోళ్లకు వెంటనే వైద్యసేవలు అందించాలని, కోర్సు ప్రకారం మందులు వాడేలా, జాగ్రత్తలు పాటించేలా చూడాలని సూచించారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, వసతి గృహాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. సమీక్షలలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, డీసీహెచ్ఎస్ డాక్టర్ రవికుమార్, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీఐఓ డాక్టర్ యుగంధర్, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

ఇకపై సచివాలయాల్లో ఫిర్యాదుల స్వీకరణ

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇక నుంచి ప్రతి గ్రామ, వార్డు సచివాలయాలలోను ప్రజా ఫిర్యాదుల వేదికను నిర్వహిస్తామని కలెక్టరు గురువారం ప్రకటించారు. ప్రతి సోమవారం అక్కడ ప్రజల సమస్యలపై అర్జీలు స్వీకరిస్తామని అన్నారు. మీకోసం.ఏపీ.జీఓవీ.ఇన్ ద్వారా కూడా ఆధార్ నంబర్‌ను ఉపయోగించి సమస్యలపై అర్జీలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. వచ్చే సోమవారం నుంచి జిల్లాలోని అన్ని గ్రామ, వార్డు సచివాలయాలలో ఫిర్యాదుల స్వీకరణ ప్రారంభమౌతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మీరు వద్దులేప్పా..!

పాత సీఐలను ఇష్టపడని ఎమ్మెల్యేలు

కొత్తవారికే అవకాశం ఇవ్వాలన్న భావన

ప్రజాప్రతినిధులకు భారీగా సిఫార్సులు

అనంతపురంలోని స్టేషన్లకు తీవ్రపోటీ

తాడిపత్రిలో పనిచేసేందుకు అయిష్టత

అనంతపురం క్రైం, జూలై 25: పోలీసు శాఖలో బదిలీలకు సీఐలు, ఎస్ఐలు మానసికంగా సిద్ధమయ్యారు. అనువైన స్టేషన్‌కు బదిలీ చేయించుకునేందుకు చాలామంది ప్రయత్నాలు ప్రారంభించారు. టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో కొందరు అధికారుల బదిలీ తప్పదని స్పష్టమైంది. ఈ నేపథ్యంలో సిఫార్సుల కోసం ప్రజాప్రతినిధుల వద్దకు క్యూ కడుతున్నారు. పాతవారిపట్ల చాలామంది ప్రజాప్రతినిధులు, నాయకులు అయిష్టత చూపుతున్నారని సమాచారం. గతంలో పనిచేసినవారికంటే కొత్తవారే మేలని ఎక్కువ మంది భావిస్తున్నారట. దీంతో కొత్తగా వచ్చే స్టేషన్ హౌస్ ఆఫీసర్లు ఎవరనే చర్చ జిల్లాలో జోరుగా సాగుతోంది.

అసెంబ్లీ సమావేశాల తరువాత..?

ఎస్పీ గౌతమి శాలి బదిలీ అయ్యారు. తరువాత డీఎస్పీలు, సీఐల బదిలీలు ఉంటాయని భావిస్తున్నారు. డీఎస్పీల బదిలీల విషయంలో కొంత సందిగ్ధత నెలకొన్నట్లు తెలుస్తోంది. గ్రూప్-1 ద్వారా ఎంపికైన కొత్త డీఎస్పీలకు విధులు అప్పగించాలని ప్రభుత్వం భావిస్తోంది. కానీ ఆ నియామకాల వివాదం కోర్టు పరిధిలో ఉన్నట్లు సమాచారం. వీరిని పక్కనపెట్టి, మిగిలిన డీఎస్పీలను బదిలీ చేసే అవకాశం ఉంది. ముందుగా సీఐల బదిలీలే ఉంటాయని, అసెంబ్లీ సమావేశాలు ముగియగానే ఈ ప్రక్రియ మొదలౌతుందని కొందరు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఇష్టమైన సీట్లకోసం పోలీసు అధికారులు ఇప్పటికే సిఫార్సు లేఖలను డీఐజీ కార్యాలయానికి పంపినట్లు సమాచారం.

అనంత ముద్దు.. తాడిపత్రి వద్దు..

అనంతపురం నగరంలోని నాలుగు స్టేషన్లకు పోటీ అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. తాడిపత్రి పట్టణానికి వెళ్లడానికి వెనుకడుగు వేస్తున్నట్లు సమాచారం. అనంతపురం వన్‌టౌన్‌కు సీఐ రాజా వస్తారని అంటున్నారు. టూటౌన్‌లో మరో ఆరు నెలలు క్రాంతికుమార్‌ను కొనసాగిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఒకవేళ ఆయన బదిలీ అయితే.. వలిబాషా, శ్రీకాంత్ యాదవ్‌లో ఎవరో ఒకరు రావచ్చని అంటున్నారు. టూటౌన్, త్రీటౌన్ పోలీస్ స్టేషన్లకు వీరిని పంపుతారనే ప్రచారం ఉంది. నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు సాయినాథ్ చౌదరి పేరు దాదాపు ఖరారైనట్లు సమాచారం. ఉరవకొండ రూరల్‌కు శంకర్‌రెడ్డి ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. గుంతకల్లు వన్ టౌన్‌కు యువరాజు ప్రయత్నిస్తున్నారు. కానీ ఆయన రాయదుర్గం వైపు వెళ్లే అవకాశం ఉందని తెలుస్తోంది. రాయదుర్గం రూరల్ సర్కిల్‌కు వెంకటరమణ పేరు తెరపైకి వచ్చింది. తాడిపత్రి రూరల్ స్టేషన్‌కు కత్తి శ్రీనివాసులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

హెల్మెట్ ధరించి.. ప్రయాణించండి

● డీఎల్ఎస్ఏ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్



మాట్లాడుతున్న న్యాయాధికారి శివప్రసాద్‌యాదవ్

అనంతపురం క్రైం, జూలై 25: ద్విచక్రవాహనంపై వెళ్లే ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి శివప్రసాద్ సూచించారు. ఆర్టీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో న్యాయాధికారి పాల్గొన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ పొందడానికి వచ్చిన వారితో మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. హెల్మెట్ ధరిస్తే.. ప్రమాదం జరిగినా ప్రాణాపాయం తప్పుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి వీర్రాజు, ఎంవీఐలు అతికనాజ్, శ్రీనివాసులు, సునీత, ఏఎంవీఐలు కేఎల్ఎం ప్రసాద్, రఘునాథ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆదెప్ప హత్యకేసు నిందితుల అరెస్టు

కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు

రాయదుర్గం రూరల్, జూలై 25: టీడీపీ నాయకుడు ఆదెప్ప హత్య కేసులో పది మంది నిందితులను అరెస్టు చేశామని కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. మెచ్చిరి గ్రామంలో రెండువర్గాల మధ్య రాజకీయ విబేధాలు ఉన్నాయని తెలిపారు. ఏడాదిన్నర క్రితం గడ్డివామి స్థలాల విషయంలో గొడవలు జరిగాయని, ఇరువర్గాలపై కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఆ వివాదంలో ఆదెప్ప కూడా నిందితుడు అని తెలిపారు. ఆంజనేయ స్వామి ఆలయ అర్చకుల విషయంలోనూ వివాదం ఉందని తెలిపారు. ఆలయ భూమిని అన్యాక్రాంతం చేశారని సర్పంచ్ ఊలెమ్మ కుమారుడు చంద్రశేఖర్ రెడ్డి వర్గీయులు అర్చకులను పూజలు చేసేందుకు అనుమతించలేదని అన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక అర్చకులు ఆదెప్ప సాయం కోరారని, గ్రామస్థులతో చర్చించి ఆయన ఈనెల 6న అర్చకుల చేత పూజలు చేయించారని తెలిపారు. దీంతో చంద్రశేఖర్‌రెడ్డి వర్గీయులు ఆదెప్ప రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక పథకం ప్రకారం ఈనెల 9వ తేదీ రాత్రి హత్య చేశారని తెలిపారు. గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి, గురికారి నవీన్, నామాల చంద్రశేఖర్‌రెడ్డి, మూడుముళ్ల ఆంజనేయులు, కాపు అచ్చిరెడ్డి, నామాల సందీప్‌రెడ్డి, కోళ్ల శ్రీకాంత్‌రెడ్డి, మూడుముళ్ల మారుతి, కాపు మహేష్, కాపు శ్యాంరాజు దారికాచి హత్య చేశారని డీఎస్పీ తెలిపారు. నిందితులను సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రాయదుర్గం కోర్టులో హాజరుపరిచామని తెలిపారు. సమావేశంలో రూరల్ సీఐ ప్రసాద్‌బాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

సేవాలాల్ జయంతి ఉత్సవాలకు
రూ.50 లక్షలు మంజూరు చేయండి
సీఎం చంద్రబాబుకు మంత్రి పయ్యావుల కేశవ్ వినతి



అనంతపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గుత్తి మండలం సేవాఘడ్‌లో నిర్వహించే సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలకు రూ. 50 లక్షలు నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడును రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కోరారు. సాధారణ బడ్జెట్‌లో ఉత్సవాలకు నిధుల కేటాయింపులు చేయాలన్నారు. గురువారం సీఎం క్యాంపు కార్యాలయంలో చంద్రబాబునాయుడును మంత్రి పయ్యావుల కేశవ్ కలిశారు. గుత్తి మండలంలోని సేవాఘడ్‌లో సేవాలాల్ మహరాజ్ జన్మించారన్నారు. ప్రతి ఏడాది ఫిబ్రవరి 13 నుంచి 15వ తేదీ వరకు దేశవ్యాప్తంగా ఆయన జయంతిని జరుపుకుంటున్నారన్నారు. సంత్ సేవాలాల్ మహరాజ్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు, లక్షలాది మంది భక్తులు జన్మదిన వేడుకలకు హాజరై సేవాఘడ్‌లో మాతా జగదాంబ, సేవాలాల్ మహరాజ్‌కి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ జయంతి ఉత్సవాలకు ఎలాంటి నిధులు మంజూరు చేయలేదన్నారు. ఉత్సవాల సమయంలో రవాణా, ఆహారం, వసతి, ఇతర సౌకర్యాల కోసం సంత్ సేవాలాల్ మహరాజ్ చారిటబుల్ ట్రస్టు వివిధ రూపాల్లో రుణాలు తీసుకున్నారన్నారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో ప్రతి ఏటా రూ. 25 లక్షల నిధులు మంజూరు చేసిందన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన సీఎం చంద్రబాబు నాయుడుకు గుర్తు చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2025 ఫిబ్రవరిలో నిర్వహించే సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలకు రూ. 50 లక్షలు నిధులు మంజూరు చేయాలని మంత్రి కోరారు.

రైలింజన్ల నిర్వహణలో మొదటిస్థానం: డీఆర్‌ఎం

గుత్తి, జూలై 25: రైలింజన్ల నిర్వహణలో గుత్తి డీజిల్ షెడ్ ఇండియన్ రైల్వేలోనే నెంబర్-1గా ఉందని గుంతకల్లు డీఆర్‌ఎం విజయ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక డీజిల్ షెడ్‌లో ఇండియన్ రైల్వే, వెబ్ టెక్ కంపెనీ ఆధ్వర్యంలో నూతనంగా డీజిల్ షెడ్‌కు వచ్చిన వెబ్‌టెక్ ఇంజన్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుత్తి డీజిల్ షెడ్‌లో జీ9 ఎలక్ట్రికల్ లోకోను 90, జీ4 హెచ్‌హెచ్‌పీ ఇంజన్లు 46, జీ4 ఇంజన్లు 14 ప్రస్తుతం ఉన్నాయన్నారు. అందులో భాగంగా వెబ్‌టెక్ కంపెనీకి చెందిన 130 లోకోలు డీజిల్ షెడ్‌కు దశల వారిగా వచ్చాయన్నారు. ఈ లోకోలో కార్మికులు, అధికారుల నైపుణ్యతను ఆయన కొనియాడారు. ఈ కంపెనీ నుంచి 250 డీజిల్ ఇంజన్లను కేటాయించిందన్నారు. ఇప్పటికే దశల వారిగా 130 ఇంజన్లు వచ్చాయన్నారు. గుత్తి డీజిల్ షెడ్ ఇండియన్ రైల్వేలోనే నెంబర్-1గా వచ్చేలా కృషి చేయాలన్నారు. అనంతరం ఆయన డీజిల్ షెడ్ ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో స్థానిక డీజిల్ షెడ్ డీఎంఈ ప్రమోద్, వెబ్‌టెక్ కంపెనీ ప్రతినిధులు సందీప్, రజనీస్, గుత్తి, గుంతకల్లు డీజిల్ షెడ్ అధికారులు పాల్గొన్నారు.

పట్టుదల ఉంటే లక్ష్యసాధన సులభమే
కియ సీఏఓ క్యాబ్డాంగ్ లీ



శిక్షణ పూర్తిచేసుకున్న వారితో కియ, సంభవ్ ఫౌండేషన్ సిబ్బంది, ఆర్టీసీ అధికారులు

అనంతపురం కల్చరల్, జూలై 25: పట్టుదల, ఏకాగ్రత ఉంటే అనుకున్న లక్ష్యాలను సాధించడం సులభమేనని కియ సీఏఓ క్యాబ్డాంగ్ లీ పేర్కొన్నారు. సంభవ్ ఫౌండేషన్ సహకారంతో కియ కంపెనీ ఆధ్వర్యంలో 112 మంది ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో ఉచిత డ్రైవింగ్ శిక్షణను బుధవారం నాటికి పూర్తి చేసుకున్నారు. ఈ నేపథ్యంలో గురువారం అనంతపురం డిపో ఆవరణలో వీరికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. 112 మందిలో 108 మంది హెవీ లైసెన్సును పొందగా వీరందరికీ సంభవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కియతోపాటు వివిధ కంపెనీల్లో నెలకు రూ.20వేల నుంచి రూ.30వేల వేతనంతో కూడిన ఉద్యోగావకాశాలు కల్పించారు. కార్యక్రమంలో ఆర్టీసీ అనంతపురం ఆర్‌ఎం సుమంత్ ఆర్ ఆదోని, సత్యసాయి జిల్లా డీపీటీఓ మధుసూదన్, అనంతపురం డీఎం నాగభూపాల్, ఎంఎఫ్ నారాయణస్వామి, సీఐ వినయ్‌కుమార్, బస్టాండు మేనేజర్ మూర్తి, కియా లీగల్ అడ్వైజర్ యోంగిల్ మా, మేనేజర్ రవిశంకర్, అసిస్టెంట్ మేనేజర్ వీరేంద్ర, సంభవ్ ఫౌండేషన్ సీఓఓ బాలాజి, సీఎఫ్ఓ రాజ్‌కుమార్, ఏజీఎం గిరిధర్‌రెడ్డి, ఆర్‌ఎం అనీల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

20 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

బొమ్మనహాళ్, జూలై 25: తుంగభద్ర జలాశయానికి గురువారం వరద కొనసాగుతుండడంతో టీబీ బోర్డు అధికారులు 20 క్రస్ట్‌గేట్లు ఎత్తి 45 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. వాటితోపాటు కాలువలకు 23,469 క్యూసెక్కులను వదులుతున్నారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 97,272 క్యూసెక్కులు నీరు తుంగభద్ర జలాశయంలోకి చేరుతున్నాయి. 1633 అడుగులతో 105.788 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న జలాశయంలో సాయంత్రానికి 1632.14 అడుగులతో 102.340 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న జలాశయంలో సాయంత్రానికి 1632.14 అడుగులతో గురువారం సాయంత్రానికి 102.340 టీఎంసీల నీరు నిల్వ ఉంది. హెచ్చెల్సీ బొమ్మనహాళ్ సరిహద్దు 105 వ కి.మీ. వద్ద సాయంత్రానికి 791 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

కణేకల్లు చెరువుకు చేరిన తుంగభద్ర జలాలు

కణేకల్లు: తుంగభద్ర జలాలు బుధవారం అర్ధరాత్రి కణేకల్లు చిక్కణ్ణేశ్వర వడియార్ చెరువుకు చేరాయి. ఈ నెల 22న తుంగభద్ర డ్యాం నుంచి హెచ్చెల్సీ కెనాల్‌కు నీరు విడుదల కాగా ఆంధ్రా సరిహద్దుకు 23వ తేదీన చేరుకున్నాయి. బుధవారం అర్ధరాత్రి 12గంటల సమయంలో కణేకల్లు చెరువుకు చేరిన నీటిని అధికారులు దిగువ వైపునకు మళ్లిస్తున్నారు. డ్యాం నుంచి హెచ్చెల్సీకి 750 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా ఆంధ్ర సరిహద్దు 105 కి.మీ. వద్ద 730 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. తుంగభద్ర జలాలను మొదటి ప్రాధాన్యతగా తాగునీటి కోసం ఉపయోగించనున్నట్లు డీఈ మద్దిలేటి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా హెచ్చెల్సీ నీటిపై ఆధారపడ్డ రాయదుర్గం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్, నింబగల్లు, గుంతకల్లుతోపాటు మిగతా తాగునీటి ట్యాంకర్లన్నింటికీ వారంరోజులపాటు నీటిని మళ్లిస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా 105 కి.మీ. నుంచి 189 కి.మీ. వరకు హెచ్చెల్సీ కాలువలో నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు డీఈ పేర్కొన్నారు. తుంగభద్ర జలాలు చెరువుకు చేరడంతో రైతులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

చీనీ కాయలు టన్ను రూ.18వేలు

అనంతపురం రూరల్, జూలై 25: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలు, కనిష్ఠంగా రూ.2,500, సరాసరి రూ.12 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 1156 టన్నుల చీనీకాయలు వచ్చాయని అన్నారు.

రికార్డుల మార్పుపై రైతుల ధర్నా

పాఠశాల స్థలంతోపాటు 11 ఎకరాలను ఓడీసీ మండల వాసి పేరున మార్చిన వైనం
ఎలా మారుస్తారంటూ రైతుల ఆందోళన



తహసీల్దార్‌తో రైతుల వాగ్వాదం

గోరంట్ల, జూలై 25: తమ అనుభవంలో ఉన్న దాదాపు 11.23 ఎకరాల భూమిని మరో వ్యక్తి పేరున రెవెన్యూ రికార్డుల్లో మార్పు చేయడంపై గుట్టిపల్లికి చెందిన బాధిత రైతులు తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ఆందోళనకు దిగారు. గోరంట్ల మండలంలోని గుట్టిపల్లిలో సర్వేనెంబర్ 512-2లోని 1.16ఎకరాల ప్రభుత్వ పాఠశాల స్థలంతోపాటు పలువురు రైతులకు సంబంధించిన మొత్తం 11.23ఎకరాల అనుభవంలో ఉన్న భూమిని ఓడీసీ మండలంలోని కుసుమవారిపల్లికి చెందిన కొండే ఈశ్వర్‌రెడ్డి పేరున వన్‌బీలో ఈనెల 22న అధికారులు మార్పులు చేశారు. విషయం తెలుసుకున్న బాధిత రైతులు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ అక్బల్‌బాషాతో తమగోడును వెళ్లబోసుకున్నారు. అక్కడే ఉన్న టీడీపీ నాయకులు బాలక్రిష్ణచౌదరి, నరేష్, రాజారెడ్డి, మద్దిరెడ్డిపల్లిత నరసింహులు రైతులకు మద్దతు పలికారు. అర్హులైనవారికి వన్‌బీ మార్చడానికి సంవత్సరాలతరబడి తిప్పుకుంటున్నారని, అలాంటిది అతడి పేరుమీద కొన్నిరోజుల వ్యవధిలో ఎలా భూమిని కట్టపెడతారని ప్రశ్నించారు. నెలరోజులక్రితమే పాఠశాల స్థలం మరొకరి పేరున అన్యాక్రాంతమవుతుందన్న సమాచారం ప్రధానోపాధ్యాయులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా ఆ స్థలాన్ని మరొకరికి మార్పు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో వీఆర్‌ఓ, ఆర్‌ఐలతో విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వారికి హామీ ఇచ్చారు. అయితే ఆ సమాధానంతో రైతులు సంతృప్తి చెందలేదు. తహసీల్దార్ చాంబర్ ముందు వరండాలో బైఠాయించి ధర్నా చేశారు. తమకు న్యాయం జరగకపోతే ఆత్మహత్యే శరణ్యమని రామిరెడ్డి పెట్రోల్ బాటిల్‌తో నిరసన తెలిపాడు. సీఐ సుబ్బరాయుడు అక్కడికి చేరుకుని రైతులకు సర్ది చెప్పారు. వివాదాస్పద భూమిని రికార్డుల్లో అపరిష్కృత భూమిగా తహసీల్దార్ రెడ్ మార్క్‌లో ఉంచినట్లు ప్రకటించడంతో రైతులు ఆందోళన విరమించారు. ఆందోళనలో నగేష్, మునీంద్ర, వెంకటరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి బయప్పరెడ్డి, రంగారెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఓబులరెడ్డి, తిరుపాల్, లక్ష్మీనారాయణరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, రామిరెడ్డి తదితరులున్నారు.

ఫ్యాక్టరీ యాజమాన్యం, రైతుల మధ్య ఘర్షణ
వెనుదిరిగిన పొల్యూషన్ అధికారులు



వాగ్వాదానికి దిగిన ఫ్యాక్టరీ యాజమాన్యం, రైతులు

బొమ్మనహాళ్, జూలై 25: స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీ యజమానులు, రైతుల మధ్య ఘర్షణ చోటు చేసుకోవడంతో పొల్యూషన్ అధికారులు వెనుదిరిగారు. మండల పరిధిలోని నేమకల్లు గ్రామశివారులో ఉన్న స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీల ద్వారా వచ్చే పొల్యూషన్‌తో పంట పొలాలు దెబ్బతింటున్నాయని, పరిహారం సైతం అరకొరగా అందించి చేతులుదులుపుకున్నారని ఆరోపిస్తూ రైతులు, సీపీఐ నాయకులు గతవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ నేపథ్యంలో గురువారం పొల్యూషన్ అధికారులు మహేష్, వెంకటేశు పంట భూములను పరిశీలించేందుకు వచ్చారు. విషయం తెలుసుకున్న బాధిత రైతులు పొలాల వద్దకు వెళ్లారు. వారితో సీపీఐ నాయకులు ఉన్నారు. ఇదే సందర్భంలో అక్కడకు ఫ్యాక్టరీ యాజమాన్యం చేరుకుంది. ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని చూసి మీరెందుకు ఇక్కడకు వచ్చారని సీపీఐ నాయకులు ప్రశ్నించారు. మీకు ఇక్కడ ఏం పని అని ఫ్యాక్టరీ యాజమాన్యం సీపీఐ నాయకులను అడిగారు. తమ తరఫున మాట్లాడేందుకు వచ్చారని రైతులు సమాధానమిచ్చారు. ఈ సందర్భంలో రైతులు, ఫ్యాక్టరీ యాజమాన్యానికి మధ్య వాదులాట జరిగింది. ఇదికాస్త ఘర్షణ వాతావరణానికి దారితీసింది. దీంతో పంట పొలాలను పూర్తిస్థాయిలో పరిశీలించకుండానే పొల్యూషన్ అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం రైతులు మాట్లాడుతూ ఫ్యాక్టరీల నుంచి వచ్చే పొల్యూషన్ ద్వారా పంట పొలాలు దెబ్బతినడమేకాకుండా అనారోగ్యానికి గురవుతున్నామన్నారు. అంతేకాకుండా పరిహారాన్ని సైతం అరకొరగా ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు.

అమిగోస్ ఆగడాలు ఆగవా..?
మైన్స్ కాంట్రాక్టర్ రాజేష్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 25: ప్రభుత్వం మారినా జిల్లా సంపదను కొల్లగొడుతున్న అమిగోస్ మినరల్స్ సంస్థ ఆగడాలు ఆగవా అని మైన్స్ కాంట్రాక్టర్ రాజేష్ మండిపడ్డారు. గతంలో అమిగోస్ అక్రమాలపై ఫిర్యాదు చేసినా విచారణ జరపకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని రాజేష్ గురువారం సాయంత్రం స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని భూగర్భ గనుల శాఖ డీడీ నాగయ్య ఎదుట నిరసనకు దిగాడు. 2023 డిసెంబరు 7న అమిగోస్ అక్రమాలపై మైన్స్ అధికారులకు ఆధారాలతో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఎటువంటి చర్యలు తీసుకోకపోగా ఆ సంస్థను వెనుకేసుకొస్తుండడంపై ఏంటని ప్రశ్నించారు. ఆత్మకూరు, బుక్కరాయసముద్రం మండలం కేకే అగ్రహారం, రాప్తాడు, పామిడి వంకరాజుకాలవ ప్రాంతాల్లో తాత్కాలిక అనుమతులు తీసుకుని మట్టిని తరలించిన అమిగోస్ కోట్లు కొల్లగొట్టిందని ఆరోపించారు. లీజు కాంట్రాక్టర్లను బెదిరింపులకు గురి చేస్తూ అప్పటి వైసీపీ సీఎం, అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్లు చెప్పుకుని అమిగోస్ సంస్థ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 76 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసుకుని కోట్లాది రూపాయలు దోచుకున్నారన్నారు. వెంటనే అమిగోస్ జిల్లాలో చేసిన అవినీతి, అక్రమాలు, అక్రమ వసూళ్లపై సీఐడీ విచారణ జరిపి తిన్నసొమ్మును కక్కించాలని డిమాండ్ చేశారు. అంతేగాక ప్రభుత్వానికి చెల్లించాల్సిన లీజు బకాయి సుమారు రూ.100కోట్లుని వెంటనే రికవరీ చేయాలన్నారు. అమిగోస్ ఆగడాలను సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తామన్నారు.



అమిగోస్ అక్రమాలపై మైన్స్ డీడీకి ఫిర్యాదు చేస్తున్న కాంట్రాక్టర్ రాజేష్

నమ్మించి.. రూ.4కోట్లకు టోకరా

చక్కెర వ్యాపారం పేరిట హడావుడి
అధిక వడ్డీ చెల్లిస్తూ.. అప్పులకు వల
వేరుశనగ, బియ్యం, పొట్టేళ్ల కొనుగోలు
స్నేహితుల వద్ద బంగారం తీసుకుని..
రెండు రోజుల క్రితం అదృశ్యం



మహేశ్వర్‌రెడ్డి (ఫైల్)

కదిరి/నల్లచెరువు, జూలై 25: నల్లచెరువు మండల కేంద్రానికి రెండు నెలల క్రితం వచ్చిన ఓ వ్యక్తి.. అద్దె గదిలో ఉంటూ.. అందరినీ నమ్మించి రూ.4 కోట్లకు టోకరా వేశాడు. చక్కెర వ్యాపారంతో ప్రారంభించి.. వేరుశనగ, బియ్యం, పొట్టేళ్లు.. ఇలా వివిధ రకాల వ్యాపారాలు చేస్తున్నట్లు నమ్మించాడు. అతని హంగు, ఆర్భాటం చూసి చాలా మంది అప్పులు ఇచ్చారు. మొదట్లో వారానికి రూ.లక్షకు రూ.5 వేల దాకా వడ్డీ ఇచ్చి.. వల విసిరాడు. దీంతో అత్యాశకుపోయి అతనికి చాలామంది రూ.లక్షలకు లక్షలు అప్పులు ఇచ్చారు. నల్లచెరువుకు రెండు నెలల క్రితం వచ్చిన ఆ వ్యక్తి.. తన పేరు మహేశ్వర్‌రెడ్డి అని పరిచయం చేసుకున్నాడు. నల్లచెరువు బస్టాండ్ ప్రాంతంలో ఓ గదిని అద్దెకు తీసుకున్నాడు. ఆ గదికి కార్పొరేట్ హంగులు సమకూర్చుకున్నాడు. మొదట చక్కెర వ్యాపారం మొదలు పెట్టాడు. లారీల కొద్ది చక్కెరను తీసుకువచ్చి మండలకేంద్రంతోపాటు ఇతర ప్రాంతాల్లో విక్రయించాడు. ఆయన వ్యాపార ఆర్భాటం చూసి, స్థానికంగా ఉన్న కొంతమంది చేరువయ్యారు. వారి నుంచి కొంత డబ్బు తీసుకోవడం.. వారం వారం రూ.లక్షకు రూ.5 వేల వడ్డీ చెల్లించాడు. ఇది చూసి మరికొందరు రూ.5 లక్షలు, రూ.10 లక్షలు ఇచ్చారు. ఇద్దరు వ్యాపారుల వద్ద ఆయన 80 బస్తాల బియ్యం తీసుకుని ఇతర ప్రాంతాలకు తరలించాడు. ఒక లారీ లోడు వేరుశనగ కాయలు కొన్నాడు. వివిధ గ్రామల్లో ఆరు వందల పొట్టేళ్లు కొనుగోలు చేశారు. వారంలోపు డబ్బులు చెల్లిస్తానని నమ్మించాడు. తన భార్య శుభకార్యానికి వెళుతోందని చెప్పి.. తనతో స్నేహం చేసిన ఇద్దరి నుంచి రెండు రోజుల క్రితం 20 తులాల బంగారు ఆభరణాలను తీసుకున్నాడు. అంతే..! బుధవారం మాయమైపోయాడు. ఆయన సెల్ ఫోన్ నంబర్లు పనిచేయడం లేదు. దీంతో డబ్బులిచ్చినవారు, లావాదేవీలు నడిపిన వ్యాపారులు కంగారుపడ్డారు. అతని కోసం గురువారం ఉదయం వరకు వివిధరకాలుగా ప్రయత్నించారు. ఆచూకీ లభించకపోవడంతో తాము మోసపోయామని గ్రహించి.. నల్లచెరువు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని డీఎస్పీ శ్రీలత దృష్టికి తీసుకెళ్లారు. మొత్తంగా అతను రూ.4 కోట్ల వరకూ టోకరా వేసినట్లు సమాచారం.

అరుణ్‌కుమార్‌కు ఇన్‌చార్జి డీఈఈ బాధ్యతలు



డీఈఈకి అభినందనలు..

అనంతపురం, సిటీ, జూలై 25: ఉమ్మడి జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలోని ఉరవకొండ (పీఆర్‌ఐ) డివిజన్ ఇన్‌చార్జి డీఈఈగా పనిచేస్తున్న అరుణ్ కుమార్‌కు అదే శాఖ పరిధిలోని అనంతపురం, శింగనమల (పీఆర్‌ఐ) డివిజన్ ఇన్‌చార్జి (అదనపు) బాధ్యతలు అప్పగిస్తూ ఎస్‌ఈ కేవీకేవీ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన గురువారం సాయంత్రం స్థానిక అనంతపురం, శింగనమల డివిజన్ కార్యాలయంలో ఇన్‌చార్జి డీఈఈగా బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన ఆ శాఖ ఈఈ చంద్రశేఖర్, ఎస్‌ఈ కేవీ కేవీ ప్రసాద్‌తో జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇదిలా ఉండగా ఆ శాఖ ఈఎన్‌సీ బాలునాయక్ ఆదేశాలు మేరకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినట్లు ఎస్‌ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇదివరకు ఇన్‌చార్జి డీఈఈగా పనిచేస్తున్న శ్రీనివాసమూర్తి యథావిధిగా పీఆర్‌ఐ అనంతపురం ఈఈ పీఏగా విధులు నిర్వహించనున్నారు.

ఎలుగుబంటి దాడిలో ఇద్దరికి గాయాలు

బ్రహ్మసముద్రం, జూలై 25: మండల పరిధిలోని పడమటి కోడిపల్లి గ్రామ సమీపంలో గురువారం ఎలుగుబంటి దాడిలో ఇద్దరికి గాయాలయ్యాయి. మధ్యాహ్నం గ్రామ సమీపంలో కి ఎలుగుబంటి రాగా గ్రామస్థులు తరిమారు. అయితే రవిచంద్ర, గొల్ల తిమ్మయ్యలు ఎలుగుబంటికి ఎదురుపడటంతో వారిపై దాడిచేసింది. వెంటనే వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మండలంలోని పిల్లలపల్లి, గొంచిరెడ్డిపల్లి, రాయలప్పదొడ్డి, బొమ్మగానపల్లిలో ఎలుగుబంట్లు అధికంగా ఉన్నాయని, రాత్రి వేళల్లో పొలాలకు వెళ్లాలంటే భయపడాల్సి వస్తోందని గ్రామస్థులు అంటున్నారు. అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకుని తమను కాపాడాలని కోరారు.

దరఖాస్తు చేసుకోండి: డీఈఓ

అనంతపురం విద్య, జూలై 25: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు-2024కు ఔత్సాహిక ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవచ్చునని డీఈఓ వరలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు రాష్ట్ర స్థాయి నేషనల్ ఫౌండేషన్ ఫర్ టీచర్స్ వెల్ఫేర్ ఉత్తమ టీచర్ అవార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. పూర్తి చేసిన రెండు సెట్ల దరఖాస్తులను ఆగస్టు 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా మండల విద్యాశాఖాధికారి లేదా ఉప విద్యాశాఖాధికారికి అందజేయాలన్నారు. ఆయా దరకాస్తులను ఎంఈఓలు, డిప్యూటీ డీఈఓలు పరిశీలించి, రిమార్కులు రాసి అదే నెల 10వతేదీలోగా డీఈఓ ఆఫీస్‌లో అందజేయాలన్నారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

గుంతకల్లు, జూలై 25: సెంట్రల్ రైల్వేలోని డౌండ్ వద్ద జరుగుతున్న నాన్ ఇంటర్లాకింగ్ పనుల కారణంగా గుంతకల్లు మీదగా వెళ్లే పలు రైళ్లను దారిమళ్లించనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముంబై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (నెం. 11301)ను ఈనెల 29వ తేదీ నుంచి ఆగస్టు 1వ తేదీ వరకూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 11302)ను ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకూ, అలాగే కన్యాకుమారి-పూనా ఎక్స్‌ప్రెస్ (నెం. 16382)ను ఈ నెల 28, 29 తేదీల్లోనూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 16381)ని ఈనెల 30, ఆగస్టు 1వ తేదీన పూనే, మీరజ్, కురుద్వాడి స్టేషన్ల మీదుగా మళ్లించనున్నట్లు తెలియజేశారు. ముంబై-నాగర్‌కోయిల్ ఎక్స్‌ప్రెస్ (నెం. 16352)ను ఈ నెల 28న, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 16351)ని 29వ తేదీన, చెన్నై సెంట్రల్-ఏక్తా నగర్ ఎక్స్‌ప్రెస్ (నెం. 20919)ను, ట్యుటుకోరిన్-ఓకా ఎక్స్‌ప్రెస్ (నెం. 19567)ను 28న, కరైకల్-ముంబై ఎక్స్‌ప్రెస్ (నెం. 11018)ను 29న, చెన్నై-ముంబై ఎక్స్‌ప్రెస్ (నెం. 22180) ను 30న, ముంబై-కోయంబత్తూరు ఎక్స్‌ప్రెస్ (నెం. 11013) ఈ నెల 30, 31 తేదీల్లోనూ, కోయంబత్తూరు-ముంబై ఎక్స్‌ప్రెస్ (నెం. 11014)ను, నాగర్‌కోయిల్-ముంబై ఎక్స్‌ప్రెస్ (నెం. 16340)ను ఈ నెల 29, నుంచి 31వ తేదీ వరకూ, ముంబై-నాగర్‌కోయిల్ ఎక్స్‌ప్రెస్ (నెం. 16339)ని ఈ నెల 31, ఆగస్టు 1వ తేదీన గుంతకల్లు, బళ్లారి, హుబ్లి, మీరజ్, పూనే స్టేషన్ల మీదుగా మళ్లించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ముంబై-మధురై ఎక్స్‌ప్రెస్ (నెం. 22101)ను ఈ నెల 31న, ముంబై-చెన్నై ఎక్స్‌ప్రెస్ (నెం. 22159) రైలును ఆగస్టు1న పూనా, మీరజ్, కురుద్వాడి స్టేషన్ల మీదుగా మళ్లించనున్నట్లు వివరించారు.

'వసూళ్ల కింగ్'పై ఆరా

అనంతపురం విద్య, జూలై 25: జిల్లా విద్యాశాఖలో ఏళ్ల తరబడి వసూళ్ల కింగ్‌గా మారిన అధికారి ఎవరంటూ విద్యాశాఖలో పలువురు ఆరా తీశారు. కొన్నేళ్లుగా ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో ప్రతి ఏటా వసూళ్లకు తెరలేపిన ఓ మండల విద్యాశాఖాధికారి వైఖరిపై ఆంధ్రజ్యోతిలో గురువారం 'వసూళ్ల కింగ్' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనం జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్ష ఉద్యోగుల్లో చర్చకు దారి తీసింది. ప్రైవేట్ స్కూళ్ల కరస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులు, టీచర్లు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆ మండల విద్యాశాఖాధికారి ఎవరంటూ ఆరా తీశారు. ఆయన వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల నేతలు, సదరు ఎంఈఓపై విద్యాశాఖ కమిషనర్, ప్రిన్సిపాల్ సెక్రెటరీకి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది.

28న జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు

తాడిపత్రి, జూలై 25: పట్టణంలోని వైఎస్‌ఆర్ మినీ ఫంక్షన్‌హాలులో ఈనెల 28న 5వ జిల్లాస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్న ట్లు ఆర్గనైజర్ సాయి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా 150మంది క్రీడాకారులు సబ్‌జూనియర్, క్యాడట్, జూనియర్, సీనియర్ విభాగాల్లో పాల్గొంటారన్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులు ఆగస్టు 3, 4 తేదీల్లో జరిగే అంతర్ జిల్లాల పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. పోటీలకు ముఖ్యఅతిథిగా టీడీపీ ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి హాజరవుతారన్నారు.

కేంద్ర ప్రభుత్వ అవార్డుకు ఎంపిక



భరత్ | జీవన్‌కుమార్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 25: కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న మై గవర్నమెంట్ సాతీ అవార్డుకు జిల్లాకు చెందిన బిసాటి భరత్, జీవన్‌కుమార్ ఎంపికయ్యారు. పదేళ్లుగా కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించిన బిసాటి భరత్ మై గవర్నమెంట్ అంబాసిడర్ అవార్డుకు ఎంపికయ్యారు. అదేవిధంగా యువతలో చైతన్యం కల్పిస్తున్న జీవన్‌కుమార్ మై గవర్నమెంట్ సాతీ అవార్డుకు ఎంపికయ్యారు. ఎంపికైన యువకులకు శుక్రవారం ఢిల్లీలో కేంద్ర ఐటీ శాఖ మంత్రి జితిన్‌ప్రసాద్ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. అవార్డు గ్రహీతలకు జిల్లా నెహ్రూ యువకేంద్రం అధికారి మణికంఠ, ప్రోగ్రాం ఇన్‌చార్జి శ్రీనివాసులు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి, అర్బన్‌బ్యాంకు డైరెక్టర్ సుంకర రమేష్ అభినందనలు తెలిపారు.

వజ్రాల వేటకు వెళ్లి మృత్యువాత
మహానందిలో అనంత మహిళకు పాముకాటు



లక్ష్మీదేవి మృతదేహం

మహానంది, జూలై 25. ఒక్క వజ్రం అయినా దొరకక పోదా? అనే ఆశతో వచ్చిన మహిళ పుల్లా లక్ష్మీదేవి(58) పాముకాటుకు గురై మృతి చెందింది. ఈ సంఘటన గురువారం మహానంది మండలం ఆంజనేయపురంలో జరిగింది. 10 రోజుల క్రితం మండలంలోని సర్వనరసింహస్వామి ఆలయం సమీపంలో ప్రవహించే వాగులో వజ్రల వేట కోసం అనంతపురం పాతూరుకు చెందిన పుల్లా లక్ష్మీదేవితో పాటు మరి కొందరు వచ్చారు. బుధవారం ఆంజనేయపురంలో విడిది చేసే ప్రాంతానికి లక్ష్మీదేవి చేరుకుంది. తన వెంట తెచ్చుకొన్న బ్యాగులోంచి బట్టలు తీసుకొనేందుకు తెరిచే సరికి అప్పటికే బ్యాగులో ఉన్న పాము ఆమెను కాటు వేసింది. ఆమెతో వచ్చిన వారు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక ఆమె మృతి చెందింది. గురువారం కుమారుడు ఆదినారాయణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

సైనికుల త్యాగాలకు విలువ కట్టలేం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి
నగరంలో కార్గిల్ విజయోత్సవ ర్యాలీ



విద్యార్థుల నినాదాలు

అనంతపురం సెంట్రల్, జూలై 25: దేశ రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెడుతున్న సైనికుల త్యాగాలకు విలువ కట్టలేమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు అన్నారు. బీజేవైఎం ఆధ్వర్యంలో నగరంలో గురువారం కార్గిల్ విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. కృష్ణ కళామందిరం నుంచి సప్తగిరి సర్కిల్ వరకూ కాగడాలు పట్టుకుని ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సందిరెడ్డి మాట్లాడుతూ పాకిస్థాన్ తన దుష్టబుద్ధితో కార్గిల్ కొండ ప్రాంతాలను ఆక్రమించిందని అన్నారు. ఆ ప్రాంతంలో తిష్ట వేసిన ముష్కరులను తరిమివేసేందుకు అప్పటి ప్రధాని వాజ్‌పేయి సైనిక చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. ఆ యుద్ధంలో 550 మంది భారత సైనికులు వీరమరణం పొందారని, వారి త్యాగాలను మరువలేమని అన్నారు. ర్యాలీలో బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్‌లు గొంది అశోక్‌కుమార్, చైతన్య కిషోర్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాకే శివకుమార్, జిల్లా అధ్యక్షుడు ప్రభుకుమార్, రాష్ట్ర కార్యదర్శి మందల శాంతకుమార్, బీజేవైఎం రాయలసీమ జోనల్ ఇన్‌చార్జి సూర్యప్రకాష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు దుద్దకుంట వెంకటేశ్వరరెడ్డి, జిల్లా మాజీ అంకాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు శ్రీధర్, జిల్లా ఉపాధ్యక్షుడు మాల్లారెడ్డి, లక్ష్మీనారాయణ, లక్ష్మీదేవమ్మ, గోవర్ధన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

తాగునీటి సమస్య పరిష్కరించండి

● ఇందిరమ్మ కాలనీవాసుల వినతి

గార్లదిన్నె, జూలై 25: మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు వేడుకుంటున్నారు. నాలుగు రోజుల నుంచి తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వస్తున్న అరకొర నీటితో బిందెడు నీళ్ల కోసం కొళాయిల వద్ద గంటల తరబడి వేచిచూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో ఎక్కువ శాతం కూలీ పనులు చేసుకుని జీవనం సాగించేవారే ఉన్నారు. దీంతో తాగునీటి కోసం కూలీపనులు వదులుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. పంచాయతీ అధికారులు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే నీరు అంతంత మాత్రమేనన్నారు. బిందెడు నీటి కోసం కొళాయిల వద్ద గంటల తరబడి ఉండాలంటే ఇబ్బందిగా ఉందని వాపోతున్నారు. అధికారులు స్పందించి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.


నీటి కోసం కొళాయి వద్ద వేచి ఉన్న మహిళలు

త్వరలోనే శాశ్వత పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర ఇందిరమ్మ కాలనీలో తాగునీటి సమస్య ఉన్న విషయం వాస్తవమే. కాలనీకి సరఫరా అయ్యే నీటిని ఆదర్శ, మైనార్టీ స్కూల్ వారు వాడుకుంటుండడంతో సమస్య ఏర్పడింది. ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నాం. రెండురోజుల్లో బోర్లు వేసి కాలనీకి శాశ్వత తాగునీటి సమస్య పరిష్కరిస్తామని పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర తెలిపారు.

ఉద్యాన పంటలను పరిశీలించిన కలెక్టర్

ఆత్మకూరు, జూలై 25: మండలంలోని పాపంపల్లి గ్రామంలో గురువారం కలెక్టర్ వినోద్‌కుమార్ ఉద్యాన పంటలను పరిశీలించారు. గ్రామంలోని రైతు రమేష్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఫారం పాండ్, మల్చింగ్ విధానం తదితరవాటిని ఆయన పరిశీలించారు. 20 ఎకరాల్లో రైతు అనుసరించి విధానాన్ని మరింత మంది రైతులు అమలు చేసేలా చూడాలని ఉద్యాన అధికారులకు కలెక్టర్ సూచించారు. అనంతరం నీటి ఆదా, పంటల సాగుకు డ్రిప్ పద్ధతిని ఏవిధంగా చేస్తున్నారని రైతును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం రైతులకు అన్నివిధాలుగా ప్రోత్సహిస్తోందని, వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి సుబ్బరాయుడు, హార్టికల్చర్ అధికారులు ఫిరోజ్‌ఖాన్, రత్నకుమార్, వ్యవసాయ అధికారి సుచరిత పాల్గొన్నారు.


పంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

వైభవంగా జయతీర్థస్వామి ఆరాధన

అనంతపురం కల్చరల్, జూలై 25: మొదటిరోడ్డులోని మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠంలో గురువారం జయతీర్థస్వామి ఆరాధనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంలో జయతీర్థస్వామి ప్రతిమను ఏర్పాటు చేసి ఆలయ ప్రాకారోత్సవం చేశారు. అనంతరం భక్తులు భక్తిగీతాలాపనలు చేస్తూ భజనలు చేశారు. మహామంగళహారతి నివేదనానంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం చేశారు. మఠం కార్యనిర్వాహకుడు భద్రీనాథ్, కార్యవర్గసభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


స్వామి రథంతో ఆలయ ప్రాకారోత్సవం చేస్తూ భజనలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో బీబీ ఫాతిమా చిన్నసరిగెత్తు

అనంతపురం కల్చరల్, జూలై 25: స్థానిక ఐదవ రోడ్డులో నిర్వహిస్తున్న బీబీ ఫాతిమా బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం చిన్నసరిగెత్తు వేడుకను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బీబీ ఫాతిమా పీర్లను వీధుల్లో ఊరేగిస్తుండగా భక్తులు దర్శించుకుని చక్కెర చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో బీబీ ఫాతిమా బ్రహ్మోత్సవ నిర్వాహకులు మల్లికార్జున, నరసింహులు, కేఎస్ మురళి, కిశోర్, మహేష్, చంద్రశేఖర్, అజ్జి, తిమ్మప్ప పాల్గొన్నారు.


బీబీ ఫాతిమా పీరును ఊరేగిస్తున్న భక్తులు

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

నార్పల, జూలై 25: మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో నూతనంగా నిర్మిస్తున్న లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణం కోసం నార్పల వాసి తీగల నారాయణరెడ్డి, ఆయన భార్య అన్నపూర్ణమ్మ రూ.లక్ష విరాళాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు బ్రహ్మేంద్రస్వామికి గురువారం అందజేశారు. సొంత గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి దేవాలయం నిర్మించడం కోసం తనకు తోచిన సహాయం అందించినట్లు వారు తెలిపారు.

28న షూటింగ్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 25: జిల్లా సబ్‌జూనియర్ షూటింగ్‌బాల్ బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలు 28వ తేదీన సెయింట్‌జాన్స్ స్కూల్ మైదానంలో నిర్వహించనున్నట్లు జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అమరేంద్రయాదవ్ తెలిపారు. 2008 ఏప్రిల్ 1వ తేదీ తరువాత జన్మించిన క్రీడాకారులు అర్హులన్నారు. ఆసక్తి అర్హత గల క్రీడాకారులు జనన ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, క్రీడాసామగ్రితో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 9014689895 నంబరులో సంప్రదించాలని కోరారు.

మొక్కలను సంరక్షించాలి

రాప్తాడు, జూలై 25: నాటిన ప్రతి మొక్కనూ బాధ్యతగా నీరు పోసి సంరక్షించాలని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ సూచించారు. మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీ రైతు శిక్షణా కేంద్రంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. టేకు, ఎర్రచందనం, సీతాఫలం తదితర 140 మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ మొక్కలు నాటి సంరక్షిస్తే భవిష్యత్ తరాల వారికి ఎంతో ఉపయోగకరమన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఉపసంచాలకులు మద్దిలేటి, సహాయ వ్యవసాయ సంచాలకులు శైలజాకుమారి, ఓబులపతి, హైమావతి, వ్యవసాయ అధికారులు శ్రీనివాస్, శంకర్‌లాల్‌నాయక్, ప్రసన్నాయపల్లి సర్పంచ్ శశికళ పాల్గొన్నారు.

పూడికతీత పనులు ప్రారంభం

రామగిరి, జూలై 25: మండలంలో టింబక్టు కలెక్టివ్ ఆధ్వర్యంలో పోలేపల్లి గ్రామంలోని చంద్రాయుడు కుంటలో పూడికతీత పనులు గురువారం ప్రారంభించారు. సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ..34 సంవత్సరాల నుంచి టింబక్టు కలెక్టివ్ సంస్థ పర్యావరణం, మహిళలు, రైతులు, దివ్యాంగులు, వ్యవసాయ కూలీలు, కళాకారులతో కలిసి పనిచేస్తున్నామన్నారు. పర్యావరణంలో భాగంగా నీటి వనరుల మరమ్మతులు, పూడికతీత పనులు చేపట్టామన్నారు. రాయలసీమ వాటర్ ప్రాజెక్టు మేనేజర్ శ్రీకాంత్, కో-ఆర్డినేటర్ రవి, సన్నప్పయ్య నారాయణస్వామి, ముత్యాలయ్య, సజ్జప్ప తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చూడండి

● అధికారులకు డీపీఓ ప్రభాకర్ రావు ఆదేశం

అనంతపురం న్యూటౌన్, జూలై 25: గ్రామీణ ప్రాంత ప్రజలు సీజనల్ వ్యాధులబారిన పడకుండా చర్యలు తీసుకోవాలని డీపీఓ ప్రభాకర్ రావు ఆదేశించారు. డీఎల్‌పీఓ సుమన జయంతితో కలిసి గురువారం తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. డీపీఆర్‌సీ కో-ఆర్డినేటర్ సౌజన్య, ఈఓఆర్డీ మాధవీలత తదితరులు హాజరయ్యారు. వ్యాధులు ప్రబలకుండగా చేపట్టాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. జిల్లా, మండల, గ్రామస్థాయి కమిటీల ఏర్పాటు, పీఆర్‌వన్ యాప్ సేవల గురించి చర్చించారు. వ్యాధులను కట్టడి చేసేందుకు ప్రభుత్వం కొత్తగా యాప్‌ను ప్రవేశపెట్టిందని, దీని గురించి క్షేత్రస్థాయి సిబ్బందికి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ నెల 25 నుంచి ఆగస్టు 10 వరకు క్షేత్రస్థాయిలో కార్యాక్రమాలు చేపట్టాలని ప్రభుత్వం షెడ్యూల్ ఇచ్చిందని తెలిపారు. పంచాయతీ స్థాయిలో సమస్యలను గుర్తించి.. యాప్‌లో రిజిస్టర్ చేశామని వివరించారు. ఇందులోని సమస్యలను పరిష్కరించి, ఆధారాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. నీటి కాలుష్య నివారణకు క్రమం తప్పకుండా ఈఎల్ఎస్ఆర్ క్లీనింగ్, క్లోరినేషన్ తదితర ప్యూరిఫికేషన్ చర్యలు చేపట్టాలని సూచించారు. పారిశుధ్యం మెరుగుపడేలా తగిన చర్యలు చేపట్టాలని అన్నారు.


సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ ప్రభాకర్‌రావు

పెట్టుబడి రాయితీ రూ.20వేలు అందించాలి

నార్పల, జూలై 25: అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి రాయితీ రూ.20 వేలను ఈ ఖరీఫ్‌లోనే రైతులకు అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నప్పయాదవ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రైతులు చిరుధాన్యాలైన పెసర, అలసంద, ఉలవ, సజ్జ, జొన్న, కొర్ర తదితర పంటలను సాగు చేయాలంటే ప్రభుత్వం తక్షణమే రైతులకు సరిపడా విత్తనాలను ఉచితంగా అందించాలన్నారు. ఎరువులు, పురుగుమందులు 90 శాతం సబ్సిడీతో అందించాలన్నారు. తెలంగాణ తరహాలో రూ.2లక్షల రుణమాఫీని ఈ ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించాలని, ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ పనులకు అనుసంధానం చేయాలని, సాగునీటి ప్రాజెక్టుల కింద కాలువలను శుభ్రం చేసి చివరి ఆయకట్టువరకు నీటిని అందించాలన్నారు. సీపీఐ మండల కార్యదర్శి గంగాధర్, రైతు సంఘం మండల కార్యదర్శి లలితమ్మ, సహాయ కార్యదర్శి రమేష్, నాయకులు సుధాకర్, నారాయణ, సంజీవరాయుడు, శ్రీదేవి, కుమార్, శీనా, షేక్షా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చిన్నప్పయాదవ్

ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులను సీజ్ చేయాలి

అనంతపురం విద్య, జూలై 25: జిల్లాలో ఫిట్‌నెస్ లేకుండా తిరుగుతున్న స్కూల్ బస్సులను వెంటనే సీజ్ చేయాలని పీఎస్ఎఫ్‌ఐ, ఆర్ఎస్‌వైఎఫ్ సంఘాల నాయకులు ఉప రవాణాశాఖాధికారిని కోరారు. గురువారం ఆర్టీవోను ఆ సంఘాల నాయకులు కలిశారు. పీఎస్ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ ఆలం, ఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు అరుణ్ మాట్లాడుతూ జిల్లాలో అనేక కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్ల నిర్వాహకులు, ఇంజనీరింగ్ కళాశాలల బస్సుల్లో చాలావాటిని ఫిట్‌నెస్ లేకున్నా తిప్పుతున్నారన్నారు. బస్సుల్లో సామర్థ్యానికి మించి విద్యార్థులను నింపి నడపుతున్నారన్నారు. ఫిట్‌నెస్, పర్మిట్‌లు లేకున్నా వాటిని నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి మాత్రం లక్షలాది రూపాయలు ఫీజులు దండుకుంటున్నారని మండిపడ్డారు. ఫీజులు గుంజుతున్నారు కానీ.... బస్సుల కండీషన్ పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఆయా సంఘాల నేతలు ప్రతిభ భారతి, నవీన్, భీమేష్ పాల్గొన్నారు.


ఆర్టీఓకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

వాల్మీకి సంఘం మహిళా అధ్యక్షురాలిగా రామాంజినమ్మ

రాప్తాడు, జూలై 25: వాల్మీకి సేవా సంఘం రాష్ట్ర కోర్ కమిటీ అనంతపురం జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా రాప్తాడుకు చెందిన రామాంజినమ్మను ఎంపిక చేసినట్లు ఆ సంఘం నాయకులు ప్రకటనలో తెలిపారు. సంఘం విధి విధానాలకు లోబడి వాల్మీకుల సంక్షేమం కోసం కృషి చేస్తానని ఆమె తెలిపారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

చెన్నేకొత్తపల్లి,జూలై 25: మండలంలోని బసంపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం నోట్‌పుస్తకాలు, పెన్నులు పంపిణీచేశారు. చెన్నైకు చెందిన భగవాన్ సత్యసాయి భక్తుడు శివానంద 30 మంది విద్యార్థులకు వాటిని అందజేశారు. బసంపల్లి సత్యసాయి కన్వీనర్ బయన్న, దామోదర్, రామాంజనేయులు, నాగభూషణం, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వార్షికోత్సవాన్ని జయప్రదం చేయండి

● రామకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు శ్రీకృష్ణశశి


మాట్లాడుతున్న శ్రీకృష్ణశశి

అనంతపురం కల్చరల్, జూలై 25: రామకృష్ణ సేవాసమితి 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 27 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న వేడుకలను జయప్రదం చేయాలని సమితి అధ్యక్షుడు డాక్టర్ శ్రీకృష్ణశశి పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం హెచ్చెల్సీ కాలనీలోని ఆ సమితి కార్యాలయం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేడుకల్లో భాగంగా మూడో రోడ్డులోని జీఆర్ ఫంక్షన్ హాల్‌లో ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు శ్రీ నృత్యకళానిలయం నాట్యాచార్యురాలు సంధ్యామూర్తి బృందంచే శివపదం కీర్తనల నృత్యరూపకం, సాయంత్రం 7 నుంచి 8.30 గంటల వరకు శివసాక్షాత్కారం అనే అంశంపై ఆధ్యాత్మికవేత్త సామవేదం షణ్ముఖశర్మచే ఆధ్యాత్మిక ప్రవచనాలుంటాయన్నారు. 31వ తేదీన ఉదయం 10 గంటలకు గిరిజా కల్యాణోత్సవంతో వేడుకలు ముగుస్తాయన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ సేవాసమితి కార్యదర్శి ప్రవీణ్, సహాయ కార్యదర్శి శ్రీధరమూర్తి, వేణుగోపాల్, సంధ్యామూర్తి, శ్రీవల్లి పాల్గొన్నారు.

త్రిశంకు స్వర్గంలో ఇన్‌సర్వీస్ నర్సింగ్ సిబ్బంది

● ఉద్యోగోన్నతుల కోసం 15 ఏళ్లుగా పోరాటాలు

● న్యాయం చేయాలని వైద్య మంత్రికి విన్నపం

అనంతపురం టౌన్, జూలై 25: వైద్యశాఖలో ఇన్‌సర్వీస్ నర్సింగ్ సిబ్బంది త్రిశంకు స్వర్గంలో కొట్టుమిట్టాడుతున్నారు. రెండు దశాబ్దాలుగా వైద్యసేవలు అందిస్తున్నా తమక పదోన్నతులు దక్కడం లేదు. 15 ఏళ్లుగా పోరాటాలు చేస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా వీరికి ఫలితం దక్కలేదు. ప్రస్తుతం ఇన్‌సర్వీస్ సిబ్బంది రిటైరవుతూ వస్తున్నారు. వీరి పరిస్థితి ముందు నుయ్యి.. వెనుక గొయ్యిలా మారింది. న్యాయం చేయాలని కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఏఎన్ఎం చేయడానికి జీఓ నంబరు 226 ప్రకారం టెన్త్, ఎంపీహెచ్‌డబ్ల్యూఓకు ఇంటర్ అర్హులు. అపుడు ఉద్యోగాలలో జాయిన్ అయిన ఏఎన్ఎంలు ఆ తర్వాత ఇంటర్ బేసిక్‌తో ప్రభుత్వ మెడికల్ కాలేజీలలో జీఎన్ఎం ట్రైనింగ్ ఐదేళ్లు పూర్తయినవారికి డిప్లొమా సర్టిఫిక్ ఇచ్చారు. ఆ తర్వాత సీనియారిటీ బేసిస్‌లో పోస్టులు ఖాళీగా ఉన్నపుడు అందులో 20 శాతం ట్రాన్స్‌ఫర్ బై అపాయింట్‌మెంట్ కింద స్టాఫ్‌నర్సుగా ప్రమోషన్స్ ఇచ్చారు. ఏఎన్ఎం నుంచి స్టాఫ్ నర్సుగా పదోన్నతి తీసుకోవడం వల్ల ఏఎన్ఎం సర్వీస్ మొత్తం జీరో అయిపోయింది. రాష్ట్రంలో 179 మంది ఉండగా అనంత జిల్లాలో 18 మంది ఉన్నారు. కొత్త నిబంధనల మేరకు జీఎన్ఎం చేసినవారికి ఈ సర్వీస్‌నర్సింగ్ సిబ్బంది కన్నా ఎక్కువ వేతనాలు వస్తున్నాయి. తాము 20 ఏళ్లుగా పనిచేస్తూ వస్తున్నామని, వీరందరికీ ప్రమోషన్స్ ఇవ్వాలని 2009 నుంచి పోరాటం సాగిస్తున్నారు. బుధవారం అసెంబ్లీ ప్రాంగణంలో బాధిత నర్సులు చాముండేశ్వరి, సుభద్ర, అలివేలమ్మ తదితరులు వైద్యశాఖామంత్రి సత్యకుమార్‌ను కలిసి తమగోడును వెళ్లబోసుకున్నారు. మీరైనా మాకు న్యాయం చేయాలని విన్నవించారు. పదవీ విరమణ సమయం రావడంతో ఎలాంటి పదోన్నతులు దక్కక ఇన్‌సర్వీస్ నర్సింగ్ సిబ్బంది పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.


మంత్రికి సమస్యను వివరిస్తున్న బాధిత నర్సులు

టమోటా కిలో రూ.37

అనంతపురం రూరల్, జూలై 25: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.37తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. గురువారం 1050 టన్నుల దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి రూ.30, కనిష్ఠ ధర రూ.20 పలికాయన్నారు.

సాంకేతికతతోనే అభివృద్ధి

అనంతపురంరూరల్, జూలై 25: సాంకేతికతోనే అన్నింటా అభివృద్ధి సాధించగలమని యూనివర్సిటీ ఆఫ్ ఐజు సీనియర్ అసోసియేట్ ప్రొఫెసర్ ఒగవా యోషికా అన్నారు. గురువారం పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల అంతర్గత నాణ్యత హామీ సెల్(ఐక్యూఏసీ) ఆధ్వర్యంలో నిపుణుల ప్రసంగం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జపాన్‌కు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ ఒగవా యోషికా హాజరయ్యారు. విద్యార్థులకు పలుసూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థుల్లో పరిశీలన, ఆలోచనా విధానం మెరుగుపడాలన్నారు. పరిశీలనాత్మక ఆలోచన దోరణి కలిగి ఉండాలన్నారు. దీని ద్వారా ఏ సబ్‌జెక్టుపైనైనా పట్టుసాధించవచ్చన్నారు. ప్రతి పని పట్టుదలతో సమష్టిగా చేయాలన్నారు. అంతకంటే ముందు పీవీకేకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, యూనివర్సిటీ ఆఫ్ ఐజుల మధ్య అవగాహన ఒప్పందం(ఎంఓయూ)అవకాశాన్ని కళాశాల ఛైర్మన్ పల్లెకిశోర్, ప్రొఫెసర్ యోషికా పరిశీలించారు. అనంతరం ఆమెను కళాశాల సభ్యులు సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు, ఐక్యూఏసీ అండ్ వైస్ ప్రిన్సిపాల్ దీప్తి జోర్దన, ఏఓ మనోహర్‌రెడ్డి, ఆనంద్ దంపెళ్ల పాల్గొన్నారు.


అవగాహన ఒప్పందంలో పాల్గొన్న జపాన్ యూనివర్సిటీ ప్రొఫెసర్, పీవీకేకే ఐటీ బృందం

కౌలుగుర్తింపు కార్డులను సద్వినియోగం చేసుకోండి

గార్లదిన్నె, జూలై 25: కౌలు రైతులకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన గుర్తింపు కార్డులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమాశంకరమ్మ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ అధికారి సోమశేఖర్ ఆధ్వర్యంలో కౌలురైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ భూములను కౌలుకు తీసుకున్న రైతులు ప్రభుత్వం అందచేసే కౌలు రైతు గుర్తింపు కార్డులు తప్పని సరిగా తీసుకోవాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల కౌలు రైతులు సాగుచేసిన పంటలు నష్టపోతే పంటల బీమా, నష్టపరిహారం పొందాలంటే తప్పని సరిగా గుర్తింపు కార్డులు ఉండాలన్నారు. రైతులు సాగుచేసిన పంటలను ఈక్రాప్ నమోదు తప్పని సరిగా చేయించుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రభుత్వం రాయితీతో అందచేసే ఎరువులు, విత్తనాలు తదితర వాటిని పొందవచ్చన్నారు. కౌలు గుర్తింపు కార్డులు పొందిన రైతులకు బ్యాంకు రుణాలు కూడా మంజూరు చేస్తారన్నారు. 2024-25 సంవత్సరంలో కౌలుకార్డులు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందచేశారు. తహసీల్దార్ లోకేశ్వరీ, డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్, ఏఈఓ స్రవంతి, వీఆర్వోలు గోపాల్‌రెడ్డి, వెంకటలక్ష్మి, వీపీఏ, వీహెచ్‌ఏలు, ఎంపీఈఓలు పాల్గొన్నారు.

అనంతపురంరూరల్: కౌలు గుర్తింపు కార్డు పొందిన రైతులకు నష్ట పరిహారం, క్రాప్ ఇన్సురెన్స్ పొందవచ్చని ఏఓ శశికళ అన్నారు. గురువారం ఎ.నారాయణపురం ఆర్ఎస్‌కేలో కౌలు రైతుల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ.. కౌలుకు సాగు చేస్తున్న ప్రతి రైతు గుర్తింపు కార్డు పొందాలన్నారు. ఏఈఓ మురళీకృష్ణ, వీఆర్వో రమేష్, ఉద్యాన సహాయకులు రాజేశ్వరీ, నాగలత, రైతులు పాల్గొన్నారు.


కౌలురైతులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న జేడీఏ, తహసీల్దార్

సాగు, తాగునీటికి నిధులు మంజూరు చేయండి

● సీఎంకు విన్నవించిన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల జూలై 25: నియోజకవర్గంలో సాగు, తాగునీటి సమస్య పరిష్కారాని నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కోరారు. గురువారం అసెంబ్లీ సమావేశం లో ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామనాయుడును కలిసి నియోజకవర్గంలోని సాగు, తాగునీటి సమస్యలను మండలాలు వారిగా వారి దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలోని ఎంపీఆర్ డ్యాం ప్రధాన గేట్లు ఐదవ దక్షిణ కాలువ పనులపై క్షుణ్ణంగా వివరించి చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందించేందుకు కృషి చేయాలని కోరారు. అలాగే పుట్లూరు, యల్లనూరు మండలాల రైతులకు అవసరమైన సాగునీరు అందించే గండికోట కాలువ సమస్యలు త్వరగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీఆర్‌డ్యాం మరమ్మతులు, గండికోటను క్షేత్రస్థాయిలో పరిశీలించి నియోజకవర్గ రైతన్నల సాగునీరు, ప్రజల తాగునీటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇందుకు సీఎం సానూకులంగా స్పందించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.


సీఎం చంద్రబాబుకు నీటి సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

టీడీపీ అధ్యక్షుడిని కలిసిన నటేష్‌చౌదరి

అనంతపురంఅర్బన్, జూలై 25: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఆ పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి నటేష్‌చౌదరి కలిశారు. గురువారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


పల్లా శ్రీనివాసరావుతో నటేష్‌చౌదరి

కొండన్నకు ఘన నివాళి


కొండన్న ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, కుటుంబ సభ్యులు

రామగిరి, జూలై 25: ఎమ్మెల్యే పరిటాలసునీత తండ్రి ధర్మవరపు కొండన్న నాల్గవ వర్థంతిని వెంకటాపురంలో గురువారం నిర్వహించారు. కొండన్న ఘాట్‌కు ఆయన భార్య సరస్వతి, కుమారులు ధర్మవరపు బాలాజీ, మురళి, పరిటాలరవీంద్ర కుమారులు పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్ధార్థతో పాటు స్థానిక టీడీపీ నాయకులు, అభిమానులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పరిటాల సునీత మాట్లాడుతూ తన జీవితాన్ని ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దడంలో తండ్రిపాత్ర ఎంతో ఉందన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

ప్రతిభా విద్యార్థులకు సన్మానం


విద్యార్థులను సన్మానిస్తున్న రిటైర్డ్ వైద్యాధికారి భవాని ప్రసాద్, ఉపాధ్యాయులు

ఆత్మకూరు జూలై 25: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2024 పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గురువారం ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి అభినందించారు. అనంతరం కర్నూలు మెడికల్ కళాశాల రిటైర్డ్ ప్రిన్స్‌పాల్ భవాని ప్రసాద్, ఉపాధ్యాయురాలు శ్రీదేవి నగదు బహుమతిని అందజేశారు. పాఠశాలలో మొదటి స్థానంలో నిలిచిన శివసాయి, రెండవ స్థానం సాధించిన అజయ్,మూడవ స్థానం సాధించిన అన్వేష్‌కు నగదు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస ప్రసాద్, ఉపాధ్యాయులు గురురాజ, రామాంజనేయులు, నారాయణస్వామి, పార్వతి దేవి, శ్రీలత, పద్మావతి, శైలజ, ఉమాదేవి పాల్గొన్నారు.

గత ప్రభుత్వ తప్పిదాలను కొనసాగించొద్దు

అనంతపురం సెంట్రల్, జూలై 25: వైసీపీ ప్రభుత్వంలో రిజర్వేషన్ ఉద్యోగుల పదోన్నతలు, బదిలీల అంశంలో పారదర్శకతను విస్మరించి ఆగ్రహాన్ని చెవిచూసిందని అదే తప్పిదాలను ఎన్‌డీఏ ప్రభుత్వం కొనసాగిస్తే నష్టం వాటిల్లే ప్రమాదముందని ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామచంద్ర గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. సమగ్రశిక్ష జిల్లా కార్యాలయంలో ఒకే సామాజికవర్గానికి చెందిన వారిని కీలక పదవుల్లో గత ప్రభుత్వం నియమించిందన్నారు. అదే ఒరవడిని ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించకుండా సెక్టోరియల్ ఆఫీసు, అసిస్టెంట్ సెక్రటరీల పదవుల నియామకాల్లో సామాజిక న్యాయాన్ని పాటించాలని ప్రభుత్వాన్ని కోరారు.

గడ్డివామి దగ్ధం

గార్లదిన్నె, జూలై 25: మండలంలోని కల్లూరు గ్రామంలో రైతు బ్రహ్మానందరెడ్డికి చెందిన గడ్డివాము దగ్ధమై రూ.లక్ష నష్టం వాటిల్లిన సంఘటన ఆస్తి నష్టం వాటిల్లిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. రైతు బ్రహ్మానందరెడ్డి 4 ఎకరాలలోని వరిగడ్డిని పశువుల మేత కోసం పొలం వద్దే గడ్డివాము వేసుకున్నాడు. గురువారం గుర్తుతెలియన వ్యక్తులు గడ్డివాముకు నిప్పుపెట్టారు. దీంతో మంటలు పెద్దఎత్తున వ్యాపించాయి. గమనించిన స్థానికులు మంటలను ఆదుపుచేసేందుకు ప్రయత్నించారు. గడ్డిపూర్తిగా కాలిబూడిదైంది.

మద్యం బాటిల్‌లో ఈగ

శింగనమల జూలై 25: మండల కేంద్రంలోని వైన్స్ షాపులో విక్రయించిన మద్యం బాటిల్‌లో ఈగ ఉండడతో మద్యం ప్రియులు అవాక్కయ్యారు. గురువారం సాయంత్రం సోదనపల్లి గ్రామానికి చెందిన మద్యం ప్రియుడు శింగనమల వైన్స్ షాపులో మద్యం బాటిల్ కొన్నాడు అ మద్యం బాటిల్‌లో ఈగ చనిపోవడం కనిపించి మద్యం ప్రియుడు వైన్స్‌షాపు సిబ్బందితో వాగ్వాదానికి దిగాడు. మరో బాటిల్ ఇస్తామని సిబ్బంది ప్రాధేయపడినా ఆయన మాత్రం ఎవరిని చంపాలని ఇలాంటి మద్యం ఇస్తున్నారని సిబ్బందితో గొడవ పడ్డాడు.


మద్యం బాటిల్‌లో ఈగ ఉన్న దృశ్యం

కుక్కల దాడిలో గొర్రె పిల్లల మృతి

శింగనమల, జూలై 25: మండల కేంద్రంలో గొర్రెల పిల్లల గూడుపై వీధి కుక్కలు దాడిచేయడంతో 6 గొర్రె పిల్లలు మృతి చెందాయి. గురువారం గొర్రెల కాపరి గొల్ల చలమయ్య 70 గొర్రెల పిల్లలను గ్రామానికి సమీపంలోని పొలంలో గూడులో వేసి గొర్రెలను మేతకు తీసుకెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో గొర్రెల పిల్ల గూడుపై వీధి కుక్కలు దాడి చేయడంతో 6 గొర్రె పిల్లలు మృతి చెందాగా మరో ఏడు తీవ్రంగా గాయపడ్డాయి. అప్రమత్తమైన గొర్రెలకాపరి గాయపడ్డ గొర్రె పిల్లలను పశువైద్యశాలకు తరలించారు.

డ్రిప్ వినియోగంపై రైతులకు అవగాహన


రైతులకు అవగహన కల్పిస్తున్న అధికారులు

శింగనమల జూలై 25: రైతులకు డ్రిప్ వాడకంపై ఎంపీఎంఐపీ ఆధ్వర్యంలో అవగహన కల్పిస్తున్నట్లు ఎంపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని సోదనపల్లి గ్రామంలో నెటఫిమ్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు అవగహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ డ్రిప్ మందులు ఎలావాడలి, యాసిడ్ ట్రీట్‌మెంట్ ఎలా చేయాలో క్షేత్రసాయిలో చూపి వీటి ద్వారా కలిగే ఉపయోగాలు వివరించారు. కార్యక్రమంలో శంకర్‌రెడ్డి రాజారెడ్డి రమణారెడ్డి ఓబిలేసు నాయుడు, సురేష్‌బాబు పాల్గొన్నారు.

గుత్తికోటపైకి ట్రెక్కింగ్

గుత్తి, జూలై 25: చారిత్రాత్మక గుత్తికోటపైకి గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు గురువారం ట్రెక్కింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కోటలోని పురాతన కట్టడాలు, ఏనుగుల శాల, కారాగారం, రాణిమహల్, బురుజు, బావులు తదితర కట్టడాలను సందర్శించారు. గుత్తి కోట చరిత్ర గురించి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ్ భాస్కర్, గైడ్ రమేష్ విద్యార్థులకు వివరించారు. పురావస్తు శాఖ సిబ్బంది షారుఖ్, చైతన్య, అమృత్, ఆంజనేయులు, గేట్స్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

యాడికి, జూలై 25: మండలంలోని రాయలచెరువులో గురువారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ, లయన్స్‌క్లబ్, శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన వచ్చింది. శిబిరంలో 105మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 45మందిని ఆపరేషన్ల కోసం వైద్యులు ఎంపిక చేశారు. వీరిని బెంగళూరుకు తీసుకువెళ్లి ఆపరేషన్ల అనంతరం తిరిగి రాయలచెరువుకు తీసుకువస్తారని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చల్లా సూర్యనారాయణ తెలిపారు. క్లబ్ కార్యదర్శి రామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

సబ్సిడీపై గడ్డివిత్తనాలు

యల్లనూరు, జూలై 25: మండలంలో రైతులకు పశుసంవర్ధకశాఖ తరపున సబ్సిడీపై గడ్డివిత్తనాలను అందజేస్తున్నట్లు ఏడీఏ ఖాదిర్‌బాషా గురువారం ప్రకటనలో తెలిపారు.కేజీ విత్తనాలను సబ్సిడీపోను రూ.25 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఒక్కో రైతుకు గరిష్టంగా 20కేజీల వరకు ఇస్తామన్నారు. కావాల్సిన రైతులు ఆధార్ కార్డుతోపాటు పట్టాదారు పాసుపుస్తకం నకళ్లను తీసుకు రావాలని ఆయన సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

యల్లనూరు, జూలై 25: మండలంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చేపట్టే గోకులం, గొర్రెలు, మేకల షెడ్ల నిర్మాణం కోసం ఆసక్తిగల రైతులు దరఖాస్తు చేసుకోవచ్చునని ఎంపీడీఓ వీరరాజు గురువారం ప్రకటనలో తెలిపారు. వివరాల కోసం మండల పశుసంవర్ధకశాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.

జగనన్న లేఅవుట్ అక్రమాలపై విచారణ చేయాలి

రాయదుర్గం రూరల్, జూలై 25: పట్టణంలోని జగనన్న లేఅవుట్ అక్రమాలపై విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి చిందనూరు నాగరాజు, ప్రజారక్షణ సమితి అధ్యక్షుడు శ్రీరాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వారు స్థానిక పాత బస్టాండ్ వద్ద నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ చిట్టిబాబుకు వినతిపత్రం అందించారు. గత వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకులు కొంతమంది రైతుల వద్ద తక్కువ ధరకు భూమిని కొనుగోలు చేసి ప్రభుత్వానికి ఎక్కువ ధరతో అమ్మకాలు చేశారని, వారిపై చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలుడిపై వీధికుక్క దాడి

తాడిపత్రి, జూలై 25: పట్టణంలోని సీపీఐ కాలనీలో గురువారం రాత్రి బాలుడు విశృత్‌రెడ్డిపై వీధికుక్క దాడి చేసి గాయపరిచింది. ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడిని వీధి కుక్క వెంబడించి కరిచింది. చిన్నారి కేకలు వేయడంతో తల్లిదండ్రులు వచ్చి చూడగా అప్పటికే కుక్కదాడిచేసినట్లు గమనించారు. వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం: ఎస్పీ


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

తాడిపత్రి, జూలై 25: అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ మురళీకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లతో పాటు డీఎస్పీ కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న పలు రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పని తీరుపట్ల ఆరా తీశారు. అనంతరం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్పీగా బాధ్యతలు తీసుకున్న తర్వాత జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేస్తున్నామన్నారు. అందులో భాగంగా తాడిపత్రికి వచ్చినట్లు తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయన్నారు. లా అండ్ ఆర్డర్ కాపాడడానికి నిరంతరం శ్రమిస్తామని తెలిపారు. ఎప్పటికప్పుడు రౌడీషీటర్లు, ట్రబుల్‌మాంగర్స్‌పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. ఇసుక అక్రమరవాణా, మట్కా, పేకాట తదితర అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ప్రజలకు విఘాతం కలిగించే వారు ఎవరైనా ఉపేక్షించేది లేదని, అవసరమైతే రౌడీ షీట్లు, హిస్టరీ షీట్లు ... బైండోవర్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గంజాయి విక్రయాలు జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తర్వాత మండలంలో అత్యంత సమస్యాత్మక గ్రామమైన వీరాపురంలో పర్యటించి గ్రామస్థులతో మాట్లాడారు. ఎలాంటి గొడవలకు దిగకుండా ప్రశాంత జీవనం సాగించాలని సూచించారు. ఆయన వెంట డీఎస్పీ జనార్దన్‌నాయుడు ఉన్నారు.

కౌలుహక్కు పత్రంతో ప్రభుత్వ పథకాల లబ్ధి: ఏఓ

యాడికి, జూలై 25: కౌలుహక్కు పత్రంతో కౌలు రైతులు ప్రభుత్వం నుంచి వచ్చే వివిధ పథకాల లబ్ధి పొందవచ్చునని మండల వ్యవసాయశాఖ అధికారి మహబూబ్‌బాషా తెలిపారు. మండలంలోని వీరారెడ్డిపల్లిలో గురువారం ఆయన కౌలు హక్కు పత్రంపై కౌలు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కౌలురైతులు తప్పనిసరిగా కౌలుహక్కు పత్రాలు పొందాలన్నారు. వీటిద్వారా బ్యాంక్‌లో రుణాలు, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట దెబ్బతింటే ప్రభుత్వం ద్వారా పంట నష్టపరిహారం పొందవచ్చునని చెప్పారు. కౌలుహక్కు పత్రాలకు రైతుసేవా కేంద్రం సిబ్బందిని గానీ, గ్రామ రెవెన్యూ అధికారులకు గానీ సంప్రదించాలని సూచించారు వీఆర్వో రామాంజనేయులరెడ్డి, పలువురు కౌలురైతులు పాల్గొన్నారు.

విడపనకల్లు: మండలంలోని కౌలు రైతులు గుర్తింపు కార్డులను పొంది ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను పొందాలని ఏడీఏ పద్మజా, ఏఓ హెచ్ పెన్నయ్య సూచించారు. మండలంలోని చీకలగురికి గ్రామంలో కౌలు రైతులకు వారు కౌలు గుర్తింపు కార్డులు పొందడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. అనంతరం కంది, వేరుశనగ పొలాలను పరిశీలించి పచ్చపురుగు ఆశించకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి రైతులకు తెలిపారు. సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పామిడి: మండలంలోని వంకరాజుకాలువ, కండ్లపల్లి గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలలో కౌలు కార్డులపై కౌలు రైతులకు ఏఓ లీనావసుంధర అవగాహన కల్పించారు. పట్టాదారుడు భూమిని బీడు పెట్టకుండా కౌలు రైతులకు కౌలుకు ఇవ్వాలని సూచించారు. ఆ భూమిపై కౌలు రైతుకు పంటవరకు మాత్రమే హక్కు ఉంటుందన్నారు. ఈ కార్డుకు 11 నెలలు మాత్రమే కాలపరిమితి ఉంటుందన్నారు. అనంతరం రైతు సేవా కేంద్రాల వద్ద మొక్కలను నాటారు. ఏఈఓ శ్రీనివాసరావు, వంకరాజుకాలువ సర్పంచు లక్ష్మిదేవి, మాజీ ఎంపీటీసీ రాముడు, రైతులు పాల్గొన్నారు.

కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోండి

గుంతకల్లుటౌన్: మండలంలోని కౌలు రైతులు కౌలు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఓ స్వాతి సూచించారు. పట్టణంలోని రైతు సేవా కేంద్రంలో ఆమె కౌలు రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కౌలు కార్డు దరఖాస్తు చేసుకునే రైతులు యజమాని పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, ఫొటో తీసుకుని రైతు సేవా కేంద్రంకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలన్నారు. కౌలు కార్డు లేకపోతే ప్రభుత్వ పథకాలు రావన్నారు. కావున కౌలు రైతులు ప్రతిఒక్కరూ ఈ కార్డులు పొందాలని సూచించారు.

స్త్రీనిధి సొమ్ము స్వాహాపై మహిళల ఆగ్రహం

కళ్యాణదుర్గం, జూలై 25 : మండలంలోని హులికల్లులో స్త్రీనిధి సొమ్ము స్వాహాపై మహిళలు స్థానిక వెలుగు కార్యాలయం వద్ద గురువారం ఆందోళనకు దిగారు. అక్కడే ఉన్న వెలుగుసీసీ వన్నూరుస్వామితో వాదించారు. హులికల్లుకు చెందిన నాలుగు మహిళా సంఘాలసభ్యులు స్త్రీనిధి సొమ్ము స్వాహాపై ఆరా తీశారు. ఈ సొమ్మును ఎవరు స్వాహా చేశారని వెలుగు సీసీ వన్నూరుస్వామిని నిలదీశారు. మా ప్రమేయం లేకుండా నాలుగు సంఘాలకు సంబంధించి రూ. పది నుంచి రూ. 12 లక్షల దాకా స్వాహా చేసినట్లు మా దృష్టికి వచ్చిందన్నారు. గత కొన్ని నెలల నుంచి ఈ స్వాహా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని చెబుతున్నా ఏ మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీసీని నిలదీశారు. ఆ స్వాహా చేసిన సొమ్ముపై విచారణ చేపట్టకుండా వెలుగు అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారని మండిపడ్డారు. బ్యాంకుల్లోకి వెళ్లి బ్యాంకు స్టేట్‌మెంట్ తీసుకుంటే అసలు విషయాలు బయటపడ్డాయన్నారు. ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు.

ముగిసిన మొహరం వేడుకలు

కూడేరు, జూలై 25 : మండలంలో మొహరం వేడుకలు ముగిశాయి. పి.నాగిరెడ్డిపల్లి గ్రామంలో గురువారం పీర్లు జలధికి వెళ్లాయి. ముజావర్లు తెల్లవారుజామునే పీర్లను అగ్నిగుండ ప్రవేశం చేయించి గ్రామంలో ఊరేగించారు. అనంతరం సాయంత్రం మరొకసారి అగ్నిగుండ ప్రవేశం చేయించి జలధికి తరలించారు. అంతకుమునుపు గ్రామస్థులు చక్కెర చదివింపులు చేయించారు.

కసాపురంలో మన్యుసూక్త హోమం


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

గుంతకల్లుటౌన్, జూలై 25: కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయంలో గురువారం పూర్వాభాద్ర నక్షత్రంను పురస్కరించుకుని మన్యుసూక్త హోమం నిర్వహించారు. అర్చకులు ఆలయంలోని యాగశాలలో ఆంజనేయస్వామి ఉత్సవమూర్తిని కొలువుదీర్చారు. అనంతరం వేదమంత్రోచ్చారణల నడుమ తిరుమంజనస్నపనం, మన్యుసూక్త హోమం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని పునఃప్రారంభించాలి

కళ్యాణదుర్గంరూరల్, జూలై 25 : జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పునఃప్రారంభించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు హనుమంతరాయుడు మాట్లాడుతూ జూనియర్ కళాశాలలో కొనసాగుతునన్న మధ్యాహ్న భోజనాన్ని 2019లో వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. కూటమి ప్రభుత్వం తిరిగి ప్రారంభించాలని కోరారు. అనంతరం కార్యాలయం ఏవో సురేష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఉపాధ్యక్షులు నవీన్, శైలు స్రవంతి, సహాయ కార్యదర్శి అజయ్, పట్టణ అధ్యక్షుడు హర్షవర్ధన్, ఉపాధ్యక్షుడు పవన్, సహాయ కార్యదర్శి హరి తదితరులు పాల్గొన్నారు.

పుప్పాలలో టీడీపీ, వైసీపీ వర్గీయుల గొడవ

- ఇరువర్గాలకు చెందిన నలుగురికి గాయాలు

యాడికి, జూలై25: మండలంలోని పుప్పాల గ్రామంలో టీడీపీ, వైసీపీ వర్గీయుల గొడవలో ఇరువర్గాలకు చెందిన నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పుప్పాలకు చెందిన వైసీపీ శ్రేణులు రంగస్వామినాయక్, సుదర్శన్ గురువారం సాయంత్రం బైక్‌లో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తిరిగి ఇంటికి వెళుతున్నారు. అదే సమయంలో టీడీపీకి చెందిన గంగిరెడ్డి డ్రిప్ పరికరాలను జీపులో తీసుకొని వెళుతున్నాడు. వెంగన్నపల్లి గ్రామ సమీపంలో బైక్‌లో వెళుతున్న వారిని జీపు దాటేసి వెళ్లింది. ఆ సమయంలో జీపుపై రాళ్లు రువ్వారని, దీంతో గ్రామంలోకి వెళ్లిన తర్వాత టీడీపీ, వైసీపీ వర్గీయులు కర్రలతో దాడిచేసుకున్నారని తెలిపారు. దాడిలో టీడీపీకి చెందిన రాజా, వైసీపీకి చెందిన సుధాకర్, కుళ్లాయప్ప, మురళి గాయపడ్డారన్నారు. సీఐ నాగార్జునరెడ్డిని వివరణ కోరగా సంఘటన ప్రాంతంలో ఉన్నామని, గాయపడ్డవారిని చికిత్స నిమిత్తం తాడిపత్రికి తీసుకువెళ్లారని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేస్తామని చెప్పారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

- మంత్రి ఆదేశాలతో రెండు బోర్లు వేయించిన టీడీపీ నాయకులు


బోరు వేయిస్తున్న టీడీపీ నాయకులు

విడపనకల్లు,జూలై 25: మండలంలోని పలు గ్రామాల్లో తాగు నీటి సమస్య తీర్చేందుకు గాను మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశాలతో టీడీపీ మండల నాయకులు చర్యలు చేపట్టారు. మండలకేంద్రంలోని ఎస్ఎస్ ట్యాంక్ ప్రాంగణంలో గురువారం రెండుబోర్లను వేయించారు. నీరులేక ఎస్ఎస్ ట్యాంక్ పూర్తిగా ఎండిపోయింది. దీనికితోడు తాగు నీటిని సరఫరా చేసే ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్ట్ సిబ్బందికి గత వైసీపీ ప్రభుత్వం దాదాపుగా 7 నెలల వేతనాలు ఇవ్వక పోవటంతో వారు కూడా 15 రోజులుగా సమ్మెలోకి వెళ్లారు. దీంతో ఉన్న నీటిని కూడా సరఫరా చేసేదిక్కు లేకుండాపోయింది. ఫలితంగా మండల ప్రజలకు తాగునీటి కష్టాలు అధికమయ్యాయి. దీంతో టీడీపీ నాయకులు మంత్రి ఆదేశాలతో బోర్లు వేయించడంతో పాటు ఎస్ఎస్ ట్యాంక్‌లోని కాంట్రాక్ట్ సిబ్బంది వద్దకు చేరుకుని చర్చించారు. జూన్, జూలై నెలలకు సంబంధించిన వేతనాలను తామే చెల్లిస్తామని తెలిపారు. ఇక మీదట ప్రతి రెండు నెలలకు ఒకసారి వేతనాలు ఇస్తామని, మండల ప్రజలకు తాగు నీటిని సక్రమంగా అందివ్వాలని కోరారు. దీంతో కార్మికులు సమ్మె విరమించి విధుల్లోకి చేరారు. కార్యక్రమంలో టీడీపీ సర్పంచులు తిప్పారెడ్డి, చంద్రశేఖర్, తిమ్మరాజు, జనార్థననాయుడు, నాయకులు హనుమంతు, సినిమా రామాంజినేయులు పాల్గొన్నారు.

మృతదేహాన్ని వెలికితీసి శవ పరీక్ష

కళ్యాణదుర్గం(శెట్టూరు), జూలై 25: మండలంలోని చింతర్లపల్లి గ్రామానికి చెందిన హరిజన సువర్ణ (27) అనే మహిళ అనారోగ్య కారణాలతో ఈ నెల 14వ తేదీన ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అయితే మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించకుండా అంత్యక్రియలు పూర్తి చేశారు. సమీప బంధువు డయల్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయడంతో గురువారం అనంతపురం ఫోరెన్సిక్ అధికారులు, సీఐ నాగరాజు, డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వరరెడ్డి, ఎస్ఐ రాంభూపాల్‌తో కలిసి మృతదేహాన్ని వెలికితీసి శవ పరీక్ష నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలు పాల్గొన్నారు.

పాము కాటుతో వ్యక్తి మృతి

గుత్తి రూరల్, జూలై 25: మండలంలోని బేతాపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి (46) పాము కాటుతో మృతి చెందాడు. అతను బుధవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా.. తెల్లవారుజామున సమయంలో పాముకాటు వేసింది. వెంటనే మేలుకుని పామును చంపేశాడు. ఆ తర్వాత కుటుంబసభ్యులు అతడిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. .

అబ్దుల్ వహాబ్‌కు ఘన నివాళి

గుంతకల్లు టౌన్, జూలై 25: సీపీఐ నాయకుడు అబ్దుల్ వహాబ్ సంతాప సభను పట్టణంలోని బీటీ పక్కీరప్ప భవనంలో గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సీపీఐ పట్టణ కార్యదర్శి గోపీనాథ్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్, సీపీఎం, టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగదీష్ మాట్లాడుతూ అబ్దుల్ వహాబ్ సీపీఐ మండల కార్యదర్శిగా, మున్సిపల్ కౌన్సిలర్‌గా, ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడిగా పని చేశారన్నారు. వేలాదిమంది పేద ప్రజలకు ఇళ్ల స్థలాల పంపిణీ, వివిధ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన సేవలు మరవలేనివని కొనియాడారు.

నీటి కుంటలో పడి నాలుగు గేదెలు మృతి

విడపనకల్లు, జూలై 25: మండలంలోని ఎన్ తిమ్మాపురం గ్రామం వద్ద నీటి కుంటలో పడి నాలుగు గేదెలు మృతి చెందాయి. గేదెలు గురువారం గ్రామ సమీపంలోని పొలాల్లోకి మేత కోసం వెళ్లాయని, ఈ క్రమంలో నీళ్లు తాగేందుకు కుంటలోకి దిగాయని, అయితే అందులో బురద ఎక్కువగా ఉండటంతో అవి చిక్కుకుపోయి బయటకు రాలేక మృతి చెందాయని తిమ్మాపురం గ్రామస్థులు తెలిపారు. ఐదు గేదెలు కుంటలోకి దిగగా నాలుగు మృతి చెందాయని, ఒకటి ప్రాణాలతో ఉందని అన్నారు. ఈ గేదెలు ఎవరివో తెలియదన్నారు.

30 మామిడి చెట్ల నరికివేత

కూడేరు, జూలై 25: మండలంలోని మరుట్ల-2 కాలనీ సమీపంలోని ఓ మామిడితోటలో గుర్తు తెలియని వ్యక్తులు 30 చెట్లను నరికివేశారు. గార్లదిన్నె మండలం పెనకచెర్ల డ్యామ్‌కు చెందిన షేక్ కౌసర్ బేగం ఎకరన్నర పొలంలో 60 మామిడి చెట్లు సాగు చేస్తున్నారు. కాగా అందులో 30 చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు గురువారం నరికేసినట్లు బాధితురాలు కూడేరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

వాల్మీకి సంఘం మండల అధ్యక్షుడి ఎన్నిక

విడపనకల్లు, జూలై 25: ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం విడపనకల్లు మండల అధ్యక్షుడిగా హావళిగి గ్రామానికి చెందిన భూమా బసవరాజు ఎన్నికయ్యారు. అనంతపురంలో వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో గురువా రం జరిగిన కమిటీ ఎంపికలో సంఘం రాష్ట్రకార్యదర్శి విక్రమ్ నాయుడు తనను ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు బసవరాజు ప్రకటనలో తెలిపారు.

ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం

యాడికి, జూలై25: ప్లాస్టిక్‌ను నిషేధిద్దామని ఈఓపీఆర్‌డీ వెంకటేష్ సూచించారు. మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ఆయన సర్పంచు అనురాధ అధ్యక్షతన వ్యాపారులు, స్థానికులతో గ్రామసభ నిర్వహించి మాట్లాడారు. గ్రామ పంచాయతీలో ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని నిషేధిస్తూ తీర్మానం చేశామని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగం వలన ఎన్నో అనర్థాలు జరుగుతున్నాయని వాపోయారు. కనుక ప్లాస్టిక్ నిషేధానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపీటీసీ సభ్యులు నాగరాజు, వెంకటనాయుడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి, వార్డు సభ్యుడు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బాలుర వసతి గృహం తనిఖీ

బెళుగుప్ప, జూలై 25: మండలకేంద్రంలోని బాలుర వసతి గృహాన్ని తహసీల్దార్ హరినాథ రావు గురువారం తనిఖీ చేసి వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెద్ద తిప్పయ్య, మల్లికార్జున, వీఆర్వో ఎర్రిస్వామి పాల్గొన్నారు.

కంటైనర్ బోల్తా.. ఇద్దరికి గాయాలు

తాడిపత్రి, జూలై 25: మండలంలోని గంగాదేవిపల్లి గ్రామ సమీపంలో గురువారం కంటైనర్ బోల్తాపడి ఇద్దరు గాయపడ్డారు. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పైపుల లోడ్‌తో గుత్తి నుంచి తాడిపత్రికి వస్తున్న కంటైనర్ లారీ గంగాదేవిపల్లి గ్రామ సమీపంలోకి రాగానే అదుపుతప్పి బోల్తాపడింది. అందులోని పైపులు రోడ్డుపక్కన పండ్లు విక్రయిస్తున్న నరసింహారెడ్డి, రామలక్ష్మమ్మపై పడడంతో కాళ్లు, చేతులు విరిగాయి. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

సొల్లాపురం వద్ద ముగ్గురు రైతులకు ..

కణేకల్లు: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీసుకొస్తున్న వాహనం బోల్తా పడడంతో ముగ్గురు రైతులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని సొల్లాపురం వద్ద చోటు చేసుకుంది. కణేకల్లుకు చెందిన రైతులు లతీఫ్, కుళ్లాయిస్వామి, అంజనేయులు ఉరవకొండ నుంచి ప్రైవేట్ వాహనంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకొస్తున్నారు. కాగా సొల్లాపురం వద్దకు రాగానే వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ముగ్గురు రైతులతో పాటు డ్రైవర్ మధుకు కూడా గాయాలయ్యాయి. వీరిని స్థానికులు వెంటనే కణేకల్లులోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తర్వాత అనంతపురానికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు.

పులకుర్తి సమీపంలో ఇద్దరికి..

డీ.హీరేహాళ్: మండలంలోని పులకుర్తి గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మల్లికేతి గ్రామానికి చెందిన బోయ రామకృష్ణ, బోయ వన్నూరుస్వామి కలిసి బైక్‌పై బళ్లారి వైపు బయలుదేరారు. పులకుర్తి బస్టాండ్ వద్ద కు వెళ్లగానే ఎదురుగా ఐరన్‌లోడ్‌తో వస్తున్న లారీ ఢీ కొంది. ప్రమాదంలో రామకృష్ణకు తీవ్ర గాయాలు, వన్నూరుస్వామికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని 108 వాహనంలో బళ్లారి విమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నారాయణరెడ్డిపల్లి రోడ్డులో ఒకరికి..

పుట్లూరు: మండలకేంద్రం శివారులోని నారాయణరెడ్డిపల్లి రోడ్డులో బోర్‌వెల్ జీపు బోల్తా పడి నాగార్జున అనే డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. పుట్లూరుకు చెందిన నాగార్జున పనినిమిత్తం కడవకల్లులో పని ముగించుకొని జీపులో తిరిగి ఇంటికి వెళుతుండగా ప్రమాదవశాత్తు బోల్తాపడింది.

యర్రగుంటపల్లి వద్ద ఇద్దరికి..

తాడిపత్రి: మండలంలోని యర్రగుంటపల్లి గ్రామం వద్ద ద్విచక్రవాహనాన్ని టిప్పర్ ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారని రూరల్ పోలీసులు తెలిపారు. నార్పల మండలం వెంకటాంపల్లి గ్రామానికి చెందిన తిరుపతయ్య, చితంబరి కలిసి ద్విచక్రవాహనంలో తాడిపత్రికి బయలుదేరారు. యర్రగుంటపల్లి వద్దకు రాగానే వెనుక నుంచి టిప్పర్ ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరూ గాయపడ్డారు. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

మంత్రిని కలిసిన డీసీఎంఎస్ మాజీ చైర్మన్


మంత్రితో ఏఎంసీ మాజీ చైర్మన్

ఉరవకొండ, జూలై 25: రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను డీసీఎంఎస్ మాజీ చైర్మన్ జయచంద్రనాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ రమణయాదవులు కలిశారు. అమరావతిలోని సచివాలయంలో గురువారం వారు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. వైసీపీకి చెందిన ఏఎంసీ మాజీ చైర్మన్ మంత్రిని కలవడం చర్చగా మారింది. అలాగే టీడీపీ నాయకుడు, వాల్మీకి సంఘం నాయకుడు లాయర్ శ్రీనివాసులు మంత్రిని కలిసి శాలువాతో సత్కరించారు.

టైలరింగ్ శిక్షణ ప్రారంభం

గుత్తి, జూలై 25: మహిళలు, యువతులకు ఉపాధి కల్పన కోసం టైలరింగ్, బ్యూటీషియన్ పై శిక్షణ ఇవ్వనున్నట్లు ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ఆర్డీఓ శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, జనశిక్షణ సహకారంతో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని మహిళలు, యువతులకు ఉచితంగా టైలరింగ్, బ్యూటీషియన్‌పై శిక్షణ ప్రారంభించారు. మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మహిళలు, యువతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీడీపీఓ ఢిల్లీశ్వరి, అడిషనల్ సీడీపీఓ నాగమణి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.